# అధ్యాయము 24

# ఇస్సాకు కొరకు ఒక భార్య

అబ్రాహాము తన సుదీర్ఘమైన మరియు సంఘటనాత్మకమైన జీవితము యొక్క ముగింపునకు సమీపిస్తుండగా, తన కుటుంబము, ముఖ్యంగా తన కుమారుడైన ఇస్సాకు యొక్క క్షేమము కొనసాగులాగున ఏర్పాట్లు చేసాడు. దేవుని యొక్క గొప్ప వాగ్దానము నెరవేరవలసినది ఇస్సాకు ద్వారానే, కాబట్టి దేవుడు మాట్లాడిన లెక్కింపశక్యముకాని సంతానమును దయచేయుటకు సరియైన భార్యను ఇస్సాకు కొరకు కనుగొనడం అబ్రాహాము యొక్క పని (22:17). తన మనుమళ్ల వారసత్వము దైవభక్తిలేని కనానీయులతో మిళితమవ్వకుండా ఉంటుందని అబ్రాహామునకు నిశ్చయత కావాలి.

## తన దాసునికి అబ్రాహాము ఇచ్చిన ఆజ్ఞ (24:1–9)

**1అబ్రాహాము బహు కాలము గడిచిన వృద్ధుడై యుండెను. అన్ని
విషయములలోను యెహోవా అబ్రాహామును ఆశీర్వదించెను. 2అప్పుడు అబ్రాహాము
తనకు కలిగిన సమస్తమును ఏలుచుండిన తన యింటి పెద్దదాసునితో నీ చెయ్యి నా
తొడక్రింద పెట్టుము; 3నేనుఎవరి మధ్య కాపురమున్నానో ఆ కనానీయుల
కుమార్తెలలో ఒక దానిని నా కుమారునికి పెండ్లిచేయక 4నా స్వదేశమందున్న నా
బంధువులయొద్దకు వెళ్లి ఇస్సాకను నా కుమారునికి భార్యను తెచ్చునట్లు ఆకాశము
యొక్క దేవుడును భూమియొక్క దేవుడునైన యెహోవా తోడని నీ చేత ప్రమాణము
చేయించెదననెను. 5ఆ దాసుడు–ఈ దేశమునకు నా వెంట వచ్చుటకు ఒకవేళ ఆ స్త్రీ
ఇష్టపడని యెడల నీవు బయలుదేరి వచ్చిన ఆ దేశమునకు నేను నీ కుమారుని
తీసికొని పోవలెనా అని అడుగగా 6అబ్రాహాము–అక్కడికి నా కుమారుని తీసికొని
పోకూడదు సుమీ. 7నా తండ్రి యింటనుండియు నేను పుట్టిన దేశమునుండియు
నన్ను తెచ్చి నాతో మాటలాడి–నీ సంతానమునకు ఈ దేశము నిచ్చెదనని
ప్రమాణముచేసి నాతో చెప్పిన పరలోకపు దేవుడగు యెహోవా తన దూతను నీకు
ముందుగా పంపును; అక్కడనుండి నీవు నా కుమారునికి భార్యను
తీసికొనివచ్చెదవు. 8అయితే నీ వెంట వచ్చుటకు ఆ స్త్రీ ఇష్టపడని యెడల ఈ
ప్రమాణము నుండి విడుదల పొందెదవు గాని నీవు నా కుమారుని అక్కడికి తీసికొని**

**వోకూడదని అతనితో చెప్పెను. [9]ఆ దాసుడు తన యజమానుడగు అబ్రాహాము తొడక్రింద తన చెయ్యి పెట్టి యీ సంగతి విషయమై ప్రమాణము చేసెను.**

**వచనము 1.** ఇక్కడ **అబ్రాహాము బహు కాలము గడిచిన వృద్ధుడై యుండెను** అని బైబిల్ రచయిత చెప్తున్నాడు. ఈ విధమైన వాక్యము మరణమునకు సమీపిస్తున్న వ్యక్తిని గూర్చి ప్రయోగించబడేది (యెహోషువ 13:1; 23:1; 1 రాజులు 1:1). అయినప్పటికీ, వయసైన పితరుని కథలో ఇది అసలు విషయం కాదు. ఈ అధ్యాయము ముగింపులో అబ్రాహాము యొక్క కుమారుడైన ఇస్సాకు రిబ్కాను వివాహమాడాడు (24:67); మరియు ఇది జరిగినప్పుడు ఆయన నలుబది సంవత్సరముల వయసుగలవాడని 25వ అధ్యాయం మనకు చెప్తుంది (25:20). ఇస్సాకు పుట్టినప్పుడు అబ్రాహాము నూరు సంవత్సరముల వయసుగలవాడు గనుక (21:5), ఇస్సాకు మరియు రిబ్కాలు భార్యాభర్తలు అయినప్పుడు ఆయన 140 సంవత్సరముల వయసుకంటే ఎక్కువైనవాడు కాకపోవచ్చు. దీనికి తోడు, అబ్రాహాము తన 175వ మరణించుటకు (25:7) ముందు ఈ సంఘటనలు అన్నియు చోటుచేసుకున్న తరువాత ఒక ముప్పది-ఐదు సంవత్సరములు బ్రతికినట్లుగా ఈ కథనము తెలియజేస్తుంది.

**అన్ని విషయములలోను యెహోవా అబ్రాహామును ఆశీర్వదించెను** అని ఇక్కడ కథనము చెప్తుంది. ఈ పితరుని తనతో నిబంధనా సహవాసములోనికి తెచ్చుట ద్వారాను మరియు తన జీవితమునకు ఒక అర్థాన్ని, ఉద్దేశాన్ని మరియు నిరీక్షను ఇచ్చుట ద్వారాను దేవుడు ఆయనను ఆత్మీయంగా ఆశీర్వదించాడు. సమృద్ధియైన భౌతిక ఆశీర్వాదములతో కూడా ఆయన అబ్రాహామును ఆశీర్వదించాడు: విరోధుల దేశములో భద్రతను, గొప్ప ఐశ్వర్యములను (బంగారము మరియు వెండి, గొఱ్ఱెలు మరియు మందలు, వందలకొలదీ దాసీదాసులు), నమ్మకమైన ఒక భార్య, మరియు వాగ్దాన పుత్రుడైన ఇస్సాకును ఇచ్చాడు. ఈ ఆశీర్వాదములలో కొన్ని భవిష్యత్తులో కూడా ఉన్నాయి; ఆకాశ నక్షత్రములను పోలినంత మంది సంతానము (15:5, 6) మరికొన్ని తరముల దూరంలోనే ఉన్నారు, మరియు కనాను దేశము యొక్క స్వాధీనము (15:12–21) ఇంకా జరుగవలసియుంది. అయినను, ఈ గమ్యములను దృష్టిలో ఉంచుకుని అట్టి పెద్ద వయస్సులో ఇస్సాకు వివాహము కొరకు ఏర్పాట్లను చేయవలసిన సమయము వచ్చిందని పితరుడు గమనించాడు. రాబోయే తరములకు ఆయన దేవుని వాగ్దానములను సజీవంగా ఉంచుతాడు.

**వచనము 2.** కాబట్టి, **అబ్రాహాము** తనకు మిక్కిలి నమ్మకస్తుడైన మరియు **తనకు కలిగిన సమస్తమును ఏలుచుండిన తన యింటి పెద్దదాసుని**[1] పిలిచాడు. ఈ దాసుడు దమస్కుకు చెందిన ఎలీయెజెరో (15:2–4) లేక వేరే వ్యక్తో ఖచ్చితంగా మనం చెప్పలేము; ఈ వాక్యంలో ఆయన పేరు చెప్పబడలేదు. 15వ అధ్యాయములో ఉన్న సంఘటనలు జరిగి దరిదాపుగా ఏబది-ఐదు సంవత్సరములు గడిచాయి,

కనుక ఎలీయెజెరు ఈ సమయమునకు కనీసం డెబ్బది-ఐదు సంవత్సరముల వాడై ఉంటాడు. అయినప్పటికీ, ఆయనకు హారనుకు ఒక ప్రయాణము అవసరం లేకుండా మాత్రం ఉండి ఉండదు, ఎందుకంటే పితరుల కాలంలో ప్రజలు ఎక్కువ కాలం జీవించేవారు. డెబ్బది-ఐదు సంవత్సరముల వయస్సులో అబ్రాహాము కూడా వేరే దిశలో ఇంతే దూరాన్ని ప్రయాణించాడు (12:4). విషయం ఏది అయినప్పటికీ, తనకు కలిగిన సమస్తమును ఏలుచుండిన, తనకు మిక్కిలి నమ్మకస్తుడైన దాసుని ఈ కీలకమైన పనికొరకు పిలిచాడు.

ఈ కార్యము యొక్క ప్రాముఖ్యతను తన దాసునిపై ప్రభావితం చేయుటకు అబ్రాహాము అతనికి ఇలా ఉపదేశించాడు: **నీ చెయ్యి నా తొడక్రింద పెట్టుము.** “తొడ” అను పదమునకు హెబ్రీ పదమును (יָרֵךְ, *yarek*) “నడుము” అని కూడా అనువదించవచ్చు. ఈ దాసుడు అబ్రాహాము యొక్క శరీరమును తాకవలసినవాడుగా ఉన్నాడు. ఎందుకనగా ఆయన నుండే వాగ్దానము చేయబడిన సంతానము రావలసినవారుగా (“తన నడుములో నుండి” 46:26 [KJV] చూడండి; నిర్గమ. 1:5)[2] ఉన్నారు. తన దాసుని నొద్ద నుండి పితరుడు అట్టి ఒక సూచనాత్మకమైన కార్యమును ఎదురుచూచుటకు కారణము భవిష్యత్తు తరములను గూర్చిన దేవుని వాగ్దానము ఇస్సాకునకు సరియైన భార్యను సమకూర్చుటపై ఆధారపడి ఉన్నాయి. అటువంటి ప్రత్యుత్పత్తి వలననే తమ సంతానము వారు అబ్రాహాము యొక్క విత్తనమును కొనసాగించి గొప్ప జనముగా మరియు భూమిపైనున్న కుటుంబములన్నిటికీ, దేవుడు చేసిన ప్రతిజ్ఞ ప్రకారము, ఆశీర్వాదకారముగా ఉండునట్లు చేయగలరు. తరువాత, యాకోబు కూడా యోసేపుపైన ఇదే విధంగా ఒక గంభీరమైన ఆచారమును విధించాడు, అంటే యాకోబు ఎవరినొద్ద నుండైతే తన జీవమును పొందుకున్నాడో వారు సమాధిచేయబడిన స్థలమగు మక్పెలా గుహలోనే తనను పాతిపెట్టమని తన కుమారుని కోరాడు (47:29–31). కనాను—ఐగుప్తు కాదు—దేశము తన సంతానము వారు ఒక దినమున తిరిగి వచ్చే వాగ్దాన దేశమని యాకోబుకు ఖచ్చితంగా తెలుసు.

**వచనములు 3, 4.** గంభీరమైన ఈ క్రియతో కూడా పితరుడు తన దాసునిపై ఒక ప్రమాణమును విధించాడు, **ఆకాశముయొక్క దేవుడును భూమియొక్క దేవుడునైన యెహోవా తోడని నీ చేత ప్రమాణము చేయించెదను** అని ఆయనతో ప్రమాణము చేయించాడు. ప్రమాణమును ప్రారంభించుటకు ఇది సరియగు విధానము. ఎందుకనగా తన యజమానుని దేవుడు కేవలం ఒక స్థానికమైన దేవుడు కాడని ఇది తన బాధ్యతవహించువానికి గుర్తుచేస్తుంది. ప్రమాదకరమైన ప్రయాణములో దూర దేశమునకు ఆయన వెళ్లవలసియుండగా, దేవుడు—ఆకాశమును మరియు భూమిని మరియు వాటిలోగల సమస్తమును సృష్టించిన సర్వశక్తుడైన సృష్టికర్త మరియు పోషకుడు—తనకు తోడుగా ఉంటాడని ఆయనకు నిశ్చయత

కలుగుతుంది. ఇంకా, యెహోవా పేరిట ప్రమాణము చేయుట అనునది తనకు అప్పగించబడిన పని యొక్క తీవ్రతను మరియు తన ప్రమాణము తనపై నిలిచి ఉన్నదనే విషయమును ఉద్ఘాటించింది (14:22–24 చూడండి).

తన దాసునిపై అబ్రాహాము యొక్క ఆంక్ష ఏమంటే వారు ఎవరి మధ్య కాపురమున్నారో **ఆ కనానీయుల కుమార్తెలలో ఒక దానిని** [ఇస్సాకునకు] **పెండ్లిచేయక ఉండాలి అనునది.** ఈ ప్రజలు తమస్థూలమైన విగ్రహారాధకు మరియు అనైతికతకు ప్రసిద్ధులు, మరియు వారు శాపము క్రింద ఉన్నారు (9:24–27; 15:16). దీనికి బదులు, ఆ దాసుడు అబ్రాహాము యొక్క **స్వదేశమునకు** (హారాను, 12:1, 4) మరియు తన **బంధువుల యొద్దకు** (11:27–32; 22:20–24) **ఇస్సాకను**[అతని] **కుమారునికి భార్యను తెచ్చుటకు** వెళ్లవలసియుంది. ఇస్సాకునకు మంచి భార్యను తెచ్చుట ద్వారా, అబ్రాహాము “తన తరువాత తన పిల్లలును తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించినట్లు” (18:19) అని చెప్పిన దేవుని యొక్క ఆశను నెరవేరుస్తున్నాడు.

**వచనము 5.** తనకు ఇయ్యబడిన పని యొక్క తీవ్రతను బట్టి, **దాసుడు**స్పష్టతను కోరాడు. తన యజమానుడు ఆయనకు ఇచ్చిన అసలైన పనిని నెరవేర్చుటకు ఏదైనా సమస్య ఆటంకపరుస్తే, ప్రత్యామ్నాయ మార్గము ఏదైనా ఉంటుందా? తనకు ఇయ్యబడిన పనిని ఆయన బాగుగానే అర్థం చేసుకున్నాడని దాసుడు మరలా ధ్రువీకరించుకొనుటకు ఇలా అడిగాడు, **ఈ దేశమునకు నా వెంట వచ్చుటకు ఒకవేళ ఆ స్త్రీ ఇష్టపడని యెడల నీవు బయలుదేరి వచ్చిన ఆ దేశమునకు నేను నీ కుమారుని తీసికొని పోవలెనా.** సంభవించదగు సమస్యను దాసుడు ముందుగానే గ్రహించాడు.

**వచనము 6.** యథార్థవంతుడైన తన దాసుని ప్రశ్నకు పితరుని సమాధానం బలమైన అభ్యంతరం: **అక్కడికి నా కుమారుని తీసికొని పోకూడదు సుమీ.** యౌవనురాలైన ఆ స్త్రీ మరియు ఆమె తండ్రి దాసుని విన్నపమును నిరాకరించగలరని ఆయన గ్రహించాడు. **అబ్రాహాము** తానే ఒప్పించుటకు చాలా కష్టంగా అనుభవించిన దానికి ఆమె యొక్క అంగీకారాన్ని అయన అడగబోతున్నాడు: అది ఏమంటే తన గృహమును మరియు కుటుంబమును విడచి తెలియని ఒక దూర ప్రాంతమునకు ప్రయాణించడం (12:1). నిజానికి, ఈ అన్యునితో వెళ్లుటకు ఆమె నిశ్చయించుకొనినట్లయితే, తన కుటుంబమును ఆమె బహుశా మరలా చూడకపోవచ్చును కూడా. తన భార్యను హత్తుకొని ఉండుటకు ఇస్సాకు తన వాగ్దాన దేశమును విడువలేడు; కాని, ఆ యౌవనురాలైన స్త్రీ తన తండ్రిని, తల్లిని, బంధువులను, స్నేహితులను మరియు తనకు పరిచయమైన వారిని మరియు వాటిని అన్నిటిని తను మునుపెన్నడును కలవని ఒక భర్తతో తన జీవితమును గడుపుటకు గాను ఆమెను అడుగుటకు ఈ దాసునికి బాధ్యత ఉన్నది.

**వచనము 7.** తన దాసుడు ఎదుర్కొనే అడ్డంకులు భయంకరమైనవి అని అబ్రాహాముకు తెలుసు. తన సొంత అనుభవమును ఇక్కడ పితరుడు స్మరణ చేసుకుంటూ అంటాడు, [ఆయన] **తండ్రి యింటనుండియు** [ఆయన] **పుట్టిన దేశమునుండియు** [ఆయనను] **తెచ్చి** [ఆయనతో] **మాటలాడిన పరలోకపు దేవుడగు యెహోవా**యే దీనిని చేయగలడని చెప్పాడు. "[ఆయన] పుట్టిన దేశము" కల్దీయుల ఊరును అబ్రాహాము యొక్క జన్మస్థలముగా చూపుతుంది (11:31; అపొ. 7:2, 3)[3] లేదా అది సాధారణంగా మెసొపొతమియాను గూర్చిన ప్రస్తావన అయినా అయి ఉండవచ్చు. ఊరు నుండి తెరహు కుటుంబము బయటకు వెళ్లిన తరువాత, హారనులోని తన "తండ్రి యింటిని" అబ్రాహాము విడచి కనాను దేశమునకు వచ్చాడు (12:1, 4). ఆయన కనాను **దేశము**లో ఉండటానికి కారణం ఒక నిత్యమైన స్వాస్థ్యముగా దానిని వారికి **ఇచ్చుటకు** దేవుడు వాగ్దానము చేసాడు (13:14, 15; 15:18–21). తన గతమును స్మరణము చేసుకొనుట ద్వారా తన దాసుడు చేపట్టబోయేది కేవలం మానవసంబంధమైన కార్యము కాదని అబ్రాహాము ఆయనకు పునఃనిశ్చయత కలిగించాడు. చాల సంవత్సరముల క్రితము దేవుని పిలుపుతో ప్రారంభమైన దైవిక కార్యం అది. యెహోవా అబ్రాహామును నడిపించినట్లుగానే, తన దాసునితో కూడా **తన దూతను ముందుగా** పంపుతాడు.

తన దాసుని సరియైన స్థలమునకును మరియు ఇస్సాకునకు సాటియైన **భార్య** అయ్యే సరాసరి స్త్రీనొద్దకు దేవుడు నడిపిస్తాడని అబ్రాహాము ధృడ సంకల్పంతో ఉన్నాడు. అబ్రాహాము మరియు అతని కుటుంబములను నడిపించుటకు గాను దేవుడు గతములో తన దూతలను పంపియున్నాడు గనుక (16:7–13; 18:1–22; 21:17, 18; 22:11–18), హారానునకు ఈ దాసుని పనిని కూడా పైవిచారణ చేయగలడనే ఒక నిశ్చయతను అబ్రాహాము కలిగియున్నాడు.

**వచనము 8.** తన ఆహ్వానమును అంగీకరించమని దాసుడు **ఆ స్త్రీ**ని బలవంతము చేయకూడదు. లేదా దేవుడు ఆమె యొక్క స్వయంచిత్తమును మీరి ఈ ప్రతిపాదనను అంగీకరించునట్లు చేయవలెనని కూడా ఆయన అనుకోలేదు. ఒకవేళ **వెంట వచ్చుటకు ఆ స్త్రీ ఇష్టపడని యెడల** ఆ సేవకుడు **ఈ ప్రమాణము** నుండి విడుదల పొందును. ఇదంతయు చెప్పిన మీదట, పితరుడు తన సూచనలను ముగించాడు. సంపూర్ణమైన నిబంధన ఒక్కటి మాత్రమే ఉంది: ఒకవేళ ఆ స్త్రీ దాసుని వెంట వచ్చుటకు ఇష్టపడని యెడల, ఇస్సాకును హారానుకు తీసుకొని వెళ్లుట ద్వారా పరిస్థితిని చక్కదిద్దవలసిన అవసరం లేదు. అబ్రాహాము యొక్క మనస్సునకు పట్టునట్లు ఒత్తిచెప్పిన ఆజ్ఞ **నీవు నా కుమారుని అక్కడికి తీసికొని పోకూడదని** మాత్రమే. ఆయన మరియు ఇస్సాకు జీవించవలెనని దేవుడు చెప్పిన స్థలము కనాను దేశమే, కాబట్టి అబ్రాహాము దేవుని చిత్తముతో ఏకీభవించుటకు నిశ్చయించుకున్నాడు.

**వచనము 9.** దాసునికి పితరుడు ఇచ్చిన ఆజ్ఞ, ఒకవేళ ఆ యౌవనురాలైన స్త్రీ

తన వెంట వచ్చుటకు ఇష్టపడని యెడల ఆయన బాధ్యతనుండి విడుదల అయ్యే విషయముతో సహా, పరిపూర్ణమైనది. **దాసునికి** ఇంకా మిగిలిన ఒకే విషయం **తన యజమానుడగు అబ్రాహాము తొడక్రింద తన చెయ్యి పెట్టి** ఈ కార్యమును పూర్తిచేస్తాను అని ప్రమాణము చేయడమే.

## నడిపింపు కొరకు దాసుడు చేసిన ప్రార్థన (24:10–14)

**[10]అతడు తన యజమానుని ఒంటెలలో పది ఒంటెలను తన యజమానుని ఆస్తిలో శ్రేష్ఠమైన నానావిధములగు వస్తువులను తీసికొని పోయెను. అతడు లేచి అరామ్నహరాయిములోనున్న నాహోరు పట్టణముచేరి [11]సాయంకాలమందు స్త్రీలు నీళ్లు చేదుకొనవచ్చు వేళకు ఆ ఊరి బయటనున్న నీళ్లబావియొద్ద తన ఒంటెలను మోకరింపచేసి యిట్లనెను [12]–నా యజమానుడగు అబ్రాహాము దేవుడవైన యెహోవా, నేనువచ్చిన కార్యమును త్వరలో సఫలముచేసి నా యజమానుడగు అబ్రాహాము మీద అనుగ్రహము చూపుము. [13]చిత్తగించుము, నేను ఈ నీళ్ల ఊటయొద్ద నిలుచుచున్నాను; ఈ ఊరివారి పిల్లలు నీళ్లు చేదుకొనుటకు వచ్చుచున్నారు. [14]కాబట్టి–నేను త్రాగునట్లు నీవు దయచేసి నీ కడవను వంచుమని నేను చెప్పగా– నీవు త్రాగుము నీ ఒంటెలకును నీళ్లుపెట్టెదననియే చిన్నది చెప్పునో ఆమెయే నీ సేవకుడైన ఇస్సాకు కొరకు నీవు నియమించినదై యుండునుగాక, అందువలన నీవు నా యజమానునిమీద అనుగ్రహము చూపితివని తెలిసికొందుననెను.**

**వచనము 10. ఆ దాసుడు తన యజమానునికి** చెందిన మందలో నుండి **పది ఒంటెలను** ఎంపిక చేసుకున్నాడు. **నాహోరు పట్టణమునకు** సుమారు ఒక నెల వరకు సాగే ప్రయాణము కొరకు అవసరమైన అన్ని నానావిధములగు వస్తువులను వాటిపై వేసుకున్నాడు. ఈ పేరు నాహోరు అని పిలువబడే పట్టణమును సూచిస్తుంది, కాని బహుశా ఇది **మెసొపొతమియాకు**[4] వాయువ్య దిశలో నాహోరు మరియు ఆయన కుటుంబము జీవించిన పట్టణమును సూచిస్తుంటుంది (11:31; 27:43; 28:10; 29:4 చూడండి). ఆహార వస్తువులతో పాటు, ఆ ఒంటెలు విలువగల బంగారు వెండి ఆభరణములు మరియు ప్రాచీన పశ్చిమ ఆసియాలోని ఆచారములను అనుసరించి ఓలి మరియు బహుమతుల (24:22, 53) రూపేణా ఇచ్చుటకు కొన్ని వస్తువులను కూడా మోయవలసి ఉన్నాయి. ఇంకా, ఆ దాసుడు తనతో ఇంకొంతమంది దాసులను తీసుకెళ్లాడు, వీరు ఈ కథనములో తరువాత భాగములోనే ప్రస్తావించబడ్డారు (24:32, 54, 59). ఈ మనుష్యులు అబ్రాహాము దాసునికి ఒంటెల విషయంలోను మరియు వారు మోసుకెళ్తున్న బహుమతులు మరియు వస్తువులను మార్గమధ్యంలో కొందరు దుండగులు వారిపై దాడిచేసి వాటిని దోచుకోకుండా రక్షణ మరియు భద్రత కొరకువారు అవసరమైయున్నారు.

ఒంటెలను గూర్చి ఇక్కడ ఉన్న ప్రస్తావనను కొందరు పండితులు ఈ

కథనములో ఉండుటకు కాలం చెల్లిన అంశంగా చెప్తారు, ఎందుకంటే ఒంటెలను ప్రయాణము కొరకు వినియోగించుటకు సాధుపరచడం రెండవ సహస్రాబ్ది తరువాత భాగం వరకు కూడా అవ్వలేదు. ఈ ఆలోచనపై ఆధారపడి, ఆదికాండము అనునది మొదటి సహస్రాబ్దిలో వ్రాయబడిన గ్రంథమనీ, అబ్రాహాము కాలములో ఒంటెలు వినియోగంలో ఉన్నాయని ఈ గ్రంథం ఊహిస్తుందనీ అంటారు. అబ్రాహాము కాలములో ఒంటెలు వినియోగంలో ఉన్నాయని మనకు తెలిపే బాహ్య ఆధారాలు చాలా కొరతగా ఉన్నను, ఆ కాలమునకు చెందిన అనేక ఒంటెల ఎముకలను పురావస్తు శాఖ పండితులు కనుగొన్నారు.[5] వాస్తవానికి, ఒంటెలను సాధుపరచడమును గూర్చి ఆధారాలు ఇరాన్ దేశంలో క్రీ.పూ. 2700 నుండే ఉన్నాయి, మరియు అవి రెండవ సహస్రాబ్ది సమయానికే పశ్చిమంగా మెసొపొతమియా మరియు అరేబియా ప్రాంతాలలో వ్యాపించాయి.[6] అబ్రాహాము వంటి ఐశ్వర్యవంతుడైన మనిషి ఇటువంటి ఉపయోగకరమైన జంతువుల మందలను కలిగియుండుట వాస్తవము కాగా, ఆదికాండములో బరువులు మోయుటకు ఉపయోగించే సాధారణ జంతువు గాడిద (22:3; 42:26, 27; 45:23).

**వచనము 11.** కనాను నుండి నాహోరు నివసించిన పట్టణమునకు వరకుగల ప్రయాణము సంవత్సరములో అతిచల్లని సమయములో కూడా చాలా కష్టము మరియు ఆయాసకరము. కాలము ఏదైనప్పటికీ, హారాను చేరునప్పుడు ఆ మనుష్యులు మరియు జంతువులు అలసిపోయి దప్పిగొంటాయి. ఈ కారణంగా, ఆ దాసుడు **ఊరి బయటనున్న నీళ్లబావియొద్ద ఒంటెలను మోకరింపజేసెను.**

ఆ దాసుడు ఎక్కడికి వెళ్లాలో ఎలా తెలుసుకున్నాడు అనే విషయమై ఈ వాక్యభాగము ఎటువంటి వివరణ ఇచ్చుటలేదు. ఆ స్థలమునకు నడిపించుటకు గాను తన యజమానుడు తెలిపిన దూత (24:7) యొక్క స్వరము ఏమైనా వినిపించిందా అక్కడ? విషయం ఏమైనా కూడా, సుదీర్ఘమైన ప్రయాణము వలన అలసటతో అక్కడకు చేరుకున్నాడు; కాని తన ఒంటెలకు నీళ్లు పెట్టుటకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. ఈ తన నిర్ణయమునకు కారణము అది **సాయంకాల** సమయం (అంటే ఉష్ణోగ్రత చల్లగా ఉండే సూర్యాస్తమయ సమయము), మరియు **స్త్రీలు** – అనగా అవివాహితులైన అమ్మాయిలు – **నీళ్లుచేదుకొనుటకు** త్వరలోనే అక్కడకు వస్తారని ఆయనకు తెలుసు (1 సమూ. 9:11 చూడండి). ఇస్సాకు కొరకు సాటియైన ఒక భార్యను కనుగొనుట ఆయన పని గనుక, పట్టణము వెలుపలనున్న ఆ బావినొద్దకంటే కూడా ఆమె కొరకు వెదుకుటకు దాసునికి వేరొక గొప్ప స్థలము ఉండదు.[7]

**వచనము 12.** ఈ సమయమునకు, తన **యజమానుడైన అబ్రాహాము** పక్షంగా దేవునికి (యెహోవాకు) అవశ్యంగా ప్రార్థన చేయుటకు దాసుడు ప్రారంభించాడు. తన దాసునికి ఒకే నిజమైన దేవుని యందు విశ్వాసమును కలిగించుట ద్వారా ఈ

పితరుడు ఆయనకు ఆశీర్వాదకరంగా ఉన్నాడని ఈ కార్యం మనకు తెలుపుతుంది. తన యజమానుని కుమారుడైన ఇస్సాకునకు సాటియైన భార్యను కనుగొనుటలో ఆయన చేసే ప్రయత్నము **ఫలించాలని** ఆయన ప్రార్థన. అంతేగాక, ఈ విన్నపమును తీర్చుట ద్వారా దేవుడు అబ్రాహామునకు **అనుగ్రహము** (חֶסֶד, *chesed*) చూపును అని సూచించాడు.

**వచనము 13.** యౌవనురాలైన స్త్రీల యొక్క గుణములను, ముఖ్యంగా వారి ఆతిథ్య లక్షణాలను, పరీక్షించుటకు దాసుడు ఒక పథకమును రచించాడు. ఆతిథ్యపు మాదిరిని మరియు కనానులో నివసించు పరదేశుల జీవితాలను ఆశీర్వదించుటలో ఇస్సాకు తండ్రి ప్రదర్శించిన దానిని (18:1–18) ఆ స్త్రీ ఇస్సాకును వివాహమాడుటకు తన యోగ్యతను ప్రదర్శించాలి అని దాసుడు అంటున్నాడు. **నేను ఈ నీళ్ల ఊట యొద్ద నిలుచుచున్నాను; ఈ ఊరివారి పిల్లలు నీళ్లు చేదుకొనుటకు వచ్చుచున్నారు.** ఈ వాక్యము "బావి"ని (בְּאֵר, *b^e'er*; 24:11, 20) ప్రస్తావిస్తుంది; అయినను, అది "ఊట" ద్వారా నింపబడుతుంది (עַיִן, *'ayin*; 24:13, 16). తమ కడవలను నింపుకొనుటకు యౌవనులైన స్త్రీలు ఇక్కడికే వచ్చేవారు. వాటిని నింపిన తరువాత, వాటిని నీరు పెట్టె తొట్టె దగ్గరకు తీసుకెళ్లి పశువులకు నీరు పెట్టుటకు వాటిలో నీటిని పోసేవారు.

**వచనము 14.** ఈ దాసుని యొక్క పరీక్ష దప్పిగొన్న ఒక ప్రయాణికునికి చూపే మామూలు సౌజన్యం కంటే ఎక్కువే ఆశిస్తుంది; ఆయన నీటిని **త్రాగునట్లు** [ఆమె యొక్క] **కడవను వంచుమని** ఆమెను అడిగిన తరువాత, ఇంకా ఆమె "**నీవు త్రాగుము నీ ఒంటెలకును నీళ్లుపెట్టెదను**" అని అనాలని విన్నపము చేసాడు. ఒంటెలు షుమారు డెబ్బది ఆరు లీటర్లు (ఇరవై-ఐదు గాలన్ల) నీళ్లు త్రాగగలవు గనుక, అబ్రాహాము యొక్క దాసుడు పది ఒంటెలతో ప్రయాణించాడు గనుకను, బ్రహ్మాండమైన మొత్తంలో నీటిని (250 గాలన్లు అనగా 950 లీటర్లు) చేదుటకు ఆమె సుముఖత చూపాలి. అట్టి ఒక యౌవనురలైన స్త్రీ నిజంగా ప్రత్యేకమైనది: దయగలిగినది, ఆతిథ్యము ఇచ్చునది, కష్టము చేయగలిగినది, మరియు వయస్సైన ఒక పరదేశునికి సహాయము చేయుటకు ఇష్టత చూపేది. దాసుడు **ఇస్సాకు** కొరకు సాటియైన భార్యను వెదకి తెచ్చే క్రమంలో మరియు తన **యజమానునికి** దేవుడు చూపే **అనుగ్రహమును** చూడాలనే ఆయన ఆశ విషయంలోను తప్పిపోకుండా ఉండునట్లు ఇట్టి కఠినమైన ఒక పరీక్షను ఎంచుకున్నాడు.[8]

## బావి నొద్దకు రిబ్కా యొక్క ఆగమనము (24:15–27)

**[15]అతడు మాటలాడుట చాలింపక ముందే అబ్రాహాము సహోదరుడైన నాహోరు భార్యయగు మిల్కా కుమారుడైన బెతూయేలుకు పుట్టిన రిబ్కా కడవ భుజముమీద పెట్టుకునివచ్చెను. [16]ఆ చిన్నది మిక్కిలి చక్కనిది; ఆమె కన్యక, ఏ పురుషుడును**

**ఆమెను కూడలేదు; ఆమె ఆ బావిలోనికి దిగిపోయి కడవను నీళ్లతో నింపుకొని యెక్కి**
**రాగా [17]ఆ సేవకుడు ఆమెను ఎదుర్కొనుటకు పరుగెత్తి–నీ కడవలో నీళ్లు కొంచెము**
**దయచేసి నన్ను త్రాగనిమ్మని అడిగెను. [18]అందుకామె–అయ్యా త్రాగుమని చెప్పి**
**త్వరగా తన కడవను చేతిమీదికి దించుకొని అతనికి దాహమిచ్చెను. [19]మరియు ఆమె**
**అతనికి దాహమిచ్చిన తరువాత–నీ ఒంటెలు త్రాగుమట్టుకు వాటికిని నీళ్లు**
**చేదిపోయుదునని చెప్పి [20]త్వరగా గాడిలో తన కడవ కుమ్మరించి తిరిగిచేదుటకు ఆ**
**బావికి పరుగెత్తుకొనిపోయి అతని ఒంటెలన్నిటికి నీళ్లు చేదిపోసెను. [21]ఆ**
**మనుష్యుడు ఆమెను తేరి చూచి తన ప్రయాణమును యెహోవా సఫలముచేసెనో లేదో**
**తెలిసికొనవలెనని ఊరకుండెను. [22]ఒంటెలు త్రాగుటయైన తరువాత ఆ మనుష్యుడు**
**అరతులము ఎత్తుగల బంగారపు ముక్కు కమ్మిని, ఆమె చేతులకు పది తులముల**
**ఎత్తుగల రెండు బంగారు కడియములను తీసి [23]–నీవు ఎవరికుమార్తెవు? దయచేసి**
**నాతో చెప్పుము; నీ తండ్రియింట మేము ఈ రాత్రి బసచేయుటకు స్థలమున్నదా అని**
**అడిగెను. [24]అందుకామె–నేను నాహోరుకు మిల్కాకనిన కుమారుడగు బెతూయేలు**
**కుమార్తెననెను. [25]మరియు ఆమె–మా యొద్ద చాలా గడ్డియు మేతయు రాత్రి**
**బసచేయుటకు స్థలమును ఉన్నవనగా [26–27]ఆ మనుష్యుడు తన తల వంచి**
**యెహోవాకు మ్రొక్కి–అబ్రాహామను నాయజమానుని దేవుడైన యెహోవా**
**స్తుతింపబడునుగాక; ఆయన నా యజమానునికి తన కృపను తన సత్యమును**
**చూపుట మానలేదు; నేను త్రోవలో నుండగానే యెహోవా నా యజమానుని**
**బంధువుల యింటికి నన్ను నడిపించెననెను.**

**వచనము 15.** దాసుడు దేవునికి ప్రార్థన చేయుట **చాలింపకముందే, రిబ్కా** బావినొద్దకు వచ్చింది. ఇక్కడ రచయిత యొక్క వివరణ దాసుడు చేసిన విన్నపమునకు దైవిక ప్రత్యుత్తరము యొక్క శీఘ్రతను వక్కాణిస్తుంది. అప్పటికే, దేవుడు తన ప్రజలకు తదుపరి చేసిన వాగ్దానమును నెరవేరుస్తున్నాడు: "వారికీలాగు జరుగును వారు వేడుకొనకమునుపు నేను ఉత్తరమిచ్చెదను వారు మనవి చేయుచుండగా నేను ఆలకించెదను" (యెషయా 65:24).

రిబ్కా యొక్క వేషభాషలు గూర్చి గాని లేదా ప్రవర్తనను గూర్చి గాని కథకుడు చెప్పే ముందు ఆమె యొక్క వంశావళిని ముందుగా గుర్తించాడు. ఇస్సాకు భార్యను గూర్చి అబ్రాహాము చెప్పిన మొట్టమొదటి లక్షణము ఏమనగా ఆమె తన బంధువులకు చెందినదై ఉండాలి (24:4). కాబట్టి, ఈ వాక్యభాగము ఆమె తండ్రియైన **బెతూయేలు**ను గుర్తించి, ఆ తరువాత ఆమెకు అమ్మమ్మ అయిన, **అబ్రాహాము సహోదరుడగు నాహోరు** భార్యయైన **మిల్కా** యొక్క పేరును ప్రస్తావిస్తుంది (11:27, 29; 22:20–23 చూడండి). ఆ యౌవనురాలైన స్త్రీ పట్టణము **వెలుపలకు తన భుజము మీద కడవతో** నీటితో దానిని నింపుటకు వచ్చింది.

**వచనము 16.** రిబ్కా **మిక్కిలి చక్కనిది** అని వాక్యభాగము చెప్తుంది, మరియు

లైంగికపరంగా అమాయకురాలై **కన్యగానే** ఉన్నదని చెప్తుంది. **ఏ పురుషుడును ఆమెను కూడలేదు** అను వాక్యము ఆమె ఒక మంచి పేరు కలిగిన యౌవన స్త్రీ అని మనకు ఇంకా స్పష్టపరుస్తుంది. ఇస్సాకు ద్వారా అబ్రాహాము సంతానమును గూర్చి దేవుడు చేసిన వాగ్దానము యొక్క లక్షణము నేపధ్యంలో ఇది చాలా ప్రాముఖ్యమైనది. ఈ యౌవన స్త్రీ ఇస్సాకునకు భార్యయైన యెడల, ఆమె ద్వారా ఆయనకు జన్మించే బిడ్డ యొక్క పితృత్వం ప్రశ్నింపలేనిదిగా ఉండాలి.

ప్రాచీన ప్రపంచంలో సాధారణంగా తండ్రి నుండి కుమారునికి భూమి మరియు ఇతర స్వాస్థ్యముల వారసత్వము సంక్రమించేది గనుక వంశావళి వివాదములు లేనిదిగా ఉండవలసిన అవసరత ఉంది. అయినను, ఈ పరిస్థితిలో భూమి మరియు స్వాస్థ్యములను మించినది ఒకటి గొప్పదిగా భావించబడాలి. దేవుడు చేసిన ఆత్మీయ మరియు భౌతిక వాగ్దానములు నెరవేరుటకు రిబ్కా యొక్క కన్యత్వము ఖచ్చితముగా ఉండాలి ఎందుకంటే అబ్రాహాము మరియు ఇస్సాకు వంశావళి ద్వారా మాత్రమే దేవుడు "ఈ భూమి యొక్క సమస్త వంశములను" ఆశీర్వదిస్తానని వాగ్దానము చేసాడు (12:3; చూడుము 17:15–19; 22:17, 18).

రిబ్కా యొక్క భౌతికపరమైన సౌందర్యము మరియు నిందారహితమైన తన గుణమును గూర్చిన వివరణ ఇచ్చిన తరువాత రచయిత **ఆమె ఆ బావిలోనికి దిగిపోయి కడవను నీళ్లతో నింపుకొని యెక్కి రాగా** అని పరిశీలించాడు. సుస్పష్టంగా, ఆ బావిలోనికి ప్రవహించే ఊట చాలా మెట్లులు క్రిందికి ఉంది; **తన కడవ**ను నింపుకొనిన తరువాత ఆ పశువులకు నీళ్లు పెట్టుటకు ఆమె అదే మెట్లులను ఎక్కిరావలసి ఉంది. ఇది అంతటి సుళువైన కృషితో కూడుకున్నది కాదు; కాబట్టి ఒంటెలకు నీళ్లు పెడతానని ఆమె చెప్పడం తనకున్న ఇతర లక్షణములకు తోడు ఆమె భౌతికంగా బలవంతురాలుగా మరియు ఆరోగ్యకరంగా ఉన్నదనడానికి ఒక సూచన.

**వచనము 17.** ఆ అమ్మాయిని దగ్గరగా పరిశీలించిన తరువాత, యెహోవాకు ఆయన చేసిన ప్రార్థనలో ఆయన ఏర్పరచుకున్న షరతులు అన్నియు ఈమెలో ఉన్నాయో లేవో తెలుసుకొనుటకు **ఆ సేవకుడు ఆమెను ఎదుర్కొనుటకు పరుగెత్తి** వెళ్లెను. ఆయన ఆమెను సమీపించగా, ఆమె **కడవలో నీళ్లు కొంచెము దయచేసి నన్ను త్రాగనిమ్ము** అని విన్నవించుకొన్నాడు.

**వచనము 18.** ఆమె యొక్క జవాబు, **అయ్యా త్రాగుము.** "అయ్యా" అను పదమునకు ఇక్కడ రిబ్కా ప్రయోగించిన పదము אֲדֹנִי (*'adoni*), ఒకరు గౌరవించాలని అనుకున్న వ్యక్తిని పలుకరించేటప్పుడు ప్రయోగించే మర్యాదకరమైన విధముగా ఉంది.[9] ఈ సందర్భంలో, ఆంగ్ల పదమైన "సార్" (NEB) అను పదమునకు సమాన పదంగా ఉంది.[10] అలసిన మరియు దప్పిగొన్న సేవకుని పట్ల ఇట్టి విధమైన కృపాసహితమైన జవాబుతో, **త్వరగా తన కడవను చేతిమీదికి దించుకొని అతనికి దాహమిచ్చెను.**

**వచనము 19.** కేవలము దాహమును తీర్చుటకంటే ఎక్కువదాని కొరకే దాసుడు ప్రార్థించాడు; కాబట్టి, **ఆమె అతనికి దాహమిచ్చిన తరువాత** అని వాక్యభాగము చెప్పినప్పుడు ఉత్కంఠ పెరిగిపోయింది. ఆమె ఇంకా ఎక్కువ ఏమన్నా చేస్తుందా? ఆ అమ్మాయి వెంటనే తనకు తానుగా, **నీ ఒంటెలు త్రాగుమట్టుకు వాటికిని నీళ్లుచేదిపోయుదునని చెప్పి** అట్లు చేసెను. ప్రత్యేకించి, ఆయన పూర్తిగా తెలియనివాడైనందున మరియు ఆ పని చాలా సమయము మరియు ప్రయాసతో కూడినందున ఒక యౌవన అమ్మాయి నుండి అట్టి ఆతిథ్యమును పొందుట దరిదాపుగా ఎన్నడూ వినలేనిది (24:14పై గల వ్యాఖ్యలను చూడండి).

**వచనము 20.** ఆమె చెప్పిన దానిని గూర్చి ఆమె మనఃపూర్వకముగానే ఉంది. **త్వరగా గాడిలో తన కడవ కుమ్మరించిన** తరువాత **తిరిగిచేదుటకు ఆ బావికి పరుగెత్తుకొనిపోయి అతని ఒంటెలన్నిటికి నీళ్లు చేదిపోసెను.** ఆతిథ్యపూర్వకమైన తన ప్రత్యుత్తరము యొక్క అత్యుత్సాహం మమ్రేను దర్శించిన ముగ్గురు మనుష్యులను కలిసి వారికి రుచికరమైన భోజనమును సిద్ధము చేయుటకు (18:1–8) అబ్రాహాము అక్కడకు ఇక్కడకు తిరిగాడని చదువరికి జ్ఞాపకము చేస్తుంది.

**వచనము 21.** దాసుడు ఆమెను **తేరి** చూచి, వయస్సైన ఒక పరదేశి యొక్క ఒంటెలకు నీళ్లు పెట్టుటకు తన బలమును విస్తరించిన అందమైన ఈ యౌవన చెలికత్తెను చూచి ఆశ్చర్యపడిపోయాడు. ఆయన కేవలం తనకొరకు "కొంచెము నీళ్లు" దయచేయమని అడిగాడు (24:17), కాని ఆమె ఒంటెలన్నిటిని సంతృప్తిపరచువరకు సరిపడే నీటిని మరలా మరలా చేదిపోసింది. ఆయన ఆమెను చూస్తుండగా, ఇది **యెహోవా వలన కలిగిన కార్యమా** అని ఆశ్చర్యంతో చూసాడు. దేవుడు తన **ప్రయాణమును సఫలము చేసాడో లేదో** చూడాలని ఆయన ఆతురతతో ఎదురు చూచాడు.

**వచనము 22.** చెప్పుకోదగిన ఈ యౌవన అమ్మాయిని గూర్చి ఆశ్చర్య పడుతూ సేవకుడు ఎదురు చూస్తుండగా, **ఒంటెలు త్రాగుట ముగించాయి.** కాబట్టి, **ఆ మనుష్యుడు అరతులము ఎత్తుగల బంగారపు ముక్కు కమ్మిని, ఆమె చేతులకు పది తులముల ఎత్తుగల రెండు బంగారు కడియములను తీసి** ఆమె తన యెడల మరియు తన ఒంటెల యెడల చూపిన అనుగ్రహమునకు అభినందనగా ఆమెకు ఇచ్చాడు. అర-తులము లేదా తులము యొక్క ప్రాచీన కాలపు విలువ ఖచ్చితముగా నిర్ణయించలేము; కాని, బంగారు ఆభరణములతో కూడుకొనియున్న ఆయన బహుమతులు ఆమె చూపించిన ఔదార్యమును మరియు అనుగ్రహమును మించినవిగా ఉన్నాయి. "బంగారపు కమ్మి" (נֶזֶם, *nezem*) అనే పదము చెవిపోగును (35:4; నిర్గమ. 32:2, 3), లేదా ముక్కు కమ్మిని (సామెతలు 11:22; యెషయా 3:21) సూచిస్తుంది; కాని వీటిలో ఇక్కడ ఈ రెండవది అయి ఉండవచ్చు ఎందుకంటే ఈ దాసుడు తరువాత "ముక్కుకు కమ్మిని" (24:47) ఆమెకు పెట్టానని

చెప్పాడు.

**వచనము 23.** ఆయన అడిగిన రెండు సూచనలు కూడా నెరవేరడం ఆయన చూచినప్పటికి, సహాయకరమైన ఈ యౌవన స్త్రీకి తన పనిని గూర్చి చెప్పకుండా దాసుడు ఆగిపోయాడు. అబ్రాహాము యొక్క సొంత కుటుంబము నుండి ఇస్సాకునకు భార్యను కనుగొనమని తన యజమానుడు ఆయనకు ఆజ్ఞాపించుటను జ్ఞాపకము చేసుకున్నాడు. కాబట్టి, ఆమె యొక్క వంశావళిని గూర్చి ఆమెను ప్రశ్నించాడు, **నీవు ఎవరి కుమార్తెవు?** అని అడిగాడు. దీనికి తోడు, ఆయనకు మరియు ఆయన మనుష్యులకు **బస చేయుటకు**[ఆమె] **తండ్రి యింట స్థలము** ఉన్నదా అని ప్రశ్నించాడు.

**వచనము 24.** తన తండ్రిని ముందుగా పేర్కొనుట ద్వారా **ఆమె** ఆయనకు బదులిచ్చింది: **నేను ... బెతూయేలు కుమార్తెను.** బెతూయేలు ఈ కథనములో ఒక చిన్న పాత్ర మాత్రమే, ఈ సన్నివేశాలలో ఆయనకు చాలా తక్కువ ప్రాధాన్యత ఇయ్యబడింది. ఈ కథనము అంతటిలో ఆయన ఒకసారి మాత్రమే మాట్లాడుతున్నాడు. ఇదే పేరు కలిగిన ఇతర మనుష్యుల నుండి తన తండ్రిని ప్రత్యేకంగా చెప్పుటకు ఆమె బెతూయేలు, **నాహోరుకు మిల్కాకనిన కుమారుడు** అని చెప్పింది. గుర్తించుటకు ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం. ఎందుకంటే ఆమె మిల్కా మరియు నాహోరుల (అబ్రాహాము సహోదరుని) మనుమరాలునని బయలుపరచింది.

**వచనము 25.** ఇది చెప్పిన తరువాత, మరియు తన గుణమునకు నమ్మకమైనదని నిరూపించిన తరువాత, రిబ్కా ఔత్సాహికంగా మరియొక ఔదార్యపు ఆహ్వానాన్ని అందించింది. ఆయన తండ్రిని అడుగకుండా వారి కుటుంబమునొద్ద ఒంటెలకు సరిపడు **చాలా గడ్డియు మేతయు** మరియు వారు బసచేయుటకు **స్థలమును ఉన్నవని** చెప్పి ఈ పరదేశులను ఉండుటకు ఆహ్వానించింది.

**వచనమును 26, 27.** నడిపింపు కొరకును మరియు ఇస్సాకునకు భార్య అగుటకు సాటియైన యౌవన స్త్రీని కనుగొనుటలో విజయము కొరకును యెహోవాకు ప్రార్థన చేయడం బావినొద్ద ఈ దాసుని యొక్క మొదటి పనియైయుంది. ఇప్పుడు ఆయన రిబ్కాను కలిసాడు గనుక మరియు అబ్రాహాము ఆశించిన గుణమును మరియు వంశమును గూర్చిన అర్హతలను పొందియున్నది గనుక, ఆయన ఇకను ఎంతమాత్రము ఆగలేక పోయాడు. ఆయన **ఆ మనుష్యుడు తన తల వంచి యెహోవాకు మ్రొక్కెను.**

ఆ దాసుడు దేవునికి ప్రార్థన చేస్తూ అన్నాడు, **అబ్రాహామను నాయజమానుని దేవుడైన యెహోవా స్తుతింపబడునుగాక; ఆయన నా యజమానునికి తన కృపను తన సత్యమును చూపుట మానలేదు; నేను త్రోవలో నుండగానే యెహోవా నా యజమానుని బంధువుల యింటికి నన్ను నడిపించెననెను.** మొదటి పరిశీలనలో,

"యజమానుని బంధువులు" అనే భావము కొంత ప్రశ్నార్థకంగానే ఉంది, ఎందుకంటే బెతూయేలు గాని (రిబ్కా సహోదరుడైన) లాబాను కాని అబ్రాహామునకు సహోదరులు కారు. బెతూయేలు వాస్తవానికి ఆయన సహోదరుని కుమారుడు, మరియు లాబాను తన సహోదరుని మనుమడు. హెబ్రీ భాషలో "సహోదరుడు" (אָח, *'ach*) అనే పదము "రక్తమువలనైన సహోదరుడు" కంటే మరి విశాలమైన అర్థమును కలిగియుంటుంది అని అనుటకు ఇది మరియొక ఉదాహరణగా ఉంది (13:8పై గల వ్యాఖ్యలను చూడండి). ఇక్కడ ఈ పదము "సమీప బంధువు" (ESV) లేదా "బంధువు" (NIV) అనేమామూలు అర్థాన్ని ఇస్తుంది.

## రిబ్కా కుటుంబము యొక్క ప్రతి క్రియ (24:28–33)

**[28]అంతట ఆ చిన్నది పరుగెత్తుకొనిపోయి యీ మాటలు తన తల్లి యింటివారికి తెలిపెను. [29]రిబ్కాకు లాబానను నొక సహోదరు డుండెను. అప్పుడు లాబాను ఆ బావిదగ్గర వెలుపటనున్న ఆ మనుష్యుని యొద్దకు పరుగెత్తికొనిపోయెను. [30]అతడు ఆ ముక్కు కమ్మిని తన సహోదరి చేతులనున్న ఆ కడియములను చూచి–ఆ మనుష్యుడు ఈలాగు నాతో మాటలాడెనని తన సహోదరియైన రిబ్కా చెప్పిన మాటలు విని ఆ మనుష్యుని యొద్దకు వచ్చెను. అతడు ఆ బావియొద్ద ఒంటెల దగ్గర నిలిచియుండగా [31]లాబాను–యెహోవావలన ఆశీర్వదింపబడినవాడా, లోపలికి రమ్ము; నీవు బయట నిలువనేల? ఇల్లును ఒంటెలకు స్థలమును నేను సిద్ధము చేయించితిననెను. [32]ఆ మనుష్యుడు ఇంటికి వచ్చినప్పుడు లాబాను ఒంటెల గంతలు విప్పి ఒంటెలకు గడ్డియు మేతయు కాళ్లు కడుగుకొనుటకు అతనికిని అతనితో కూడనున్నవారికిని నీళ్లు ఇచ్చి [33]అతనికిభోజనము పెట్టించెను గాని అతడు–నేను వచ్చిన పని చెప్పక మునుపు భోజనము చేయననగా లాబాను–చెప్పుమనెను.**

**వచనము 28.** రిబ్కా **తన తల్లి యింటికి** పరుగెత్తుకొని పోయి **ఈ సంగతులను గూర్చి** వారికి తెలియజేసెను. తనకు బంగారు కడియములను మరియు ముక్కు కమ్మిలను ఇచ్చిన ఆ పరదేశుని గూర్చిన కథ అంతయు వారికి చెప్పింది. "తన తల్లి యింటికి" అని ఇక్కడ ఉన్న ప్రస్తావన అప్పటికే తన తండ్రి మరణించి ఉంటాడని కొందరికి ఆలోచనను కలుగజేసింది; అయితే, 24:50లో బెతూయేలును గూర్చి ప్రస్తావించిన మాట ఈ వాక్యభాగమునకు తరువాతగా మరియు పొరపాటుగా జతచేయబడి ఉంటుంది అని అర్థాన్ని ఇస్తుంది. దీనికి విరుద్ధంగా, ఇక్కడ తరువాతి కాలపు లేఖికుని పొరపాటును గూర్చి ఏ ఒక్క ప్రతుల ఆధారము మద్దతు ఇవ్వడం లేదు. బదులుగా, ఈ అమ్మాయి యొక్క సాన్నిహిత్యం ఎక్కువగా తన తల్లిలో ఉండి ఉంటుంది అని కూడా ఈ పరిభాష తెలుపుతుంది (రూతు 1:8; పరమ. 3:4; 8:2). ఈ కథ విప్పబడుచుండగా, రిబ్కా యొక్క భవిష్యత్తును గూర్చి లాబానుకు

ప్రధానమైన పాత్ర ఉన్నట్లుగా ఉంది. బహుశా ఆయన తండ్రి వృద్ధుడై ఇటువంటి ప్రాముఖ్యమైన బాధ్యతలను అన్నిటిని తన కుమారుని మీదికి వదలి ఉంటాడు.

**వచనములు 29, 30. రిబ్కాకు లాబానను నొక సహోదరుడుండెను** అని లాబానును గూర్చి కథనమును ప్రారంభించుటలో రచయిత మునుపు నాహోరు మరియు మిల్కాను గూర్చి ఇచ్చిన వంశావళిలో (22:20–24) ఇవ్వని క్రొత్త సమాచారమును ఇక్కడ ఇస్తున్నాడు. ఆయన **లాబాను**ను పరిచయం చేసిన విధానం చూస్తే, ఆ దాసుని గూర్చి రిబ్కా సమాచారము తెలియజేసిన వెంటనే **అతడు ఆ ముక్కు కమ్మిని తన సహోదరి చేతులనున్న ఆ కడియములను చూచి ఆ మనుష్యుడు** ఆమెకు చెప్పిన **మాటలను విన్నాడు** అని తెలుస్తుంది. కాబట్టి, **బావిదగ్గర వెలుపటనున్న ఆ మనుష్యుని యొద్దకు పరుగెత్తుకొనిపోయెను.** లాబానును గూర్చిన ఇట్టి పరిచయము కేవలం స్వచ్ఛమైన ఆతిథ్యము మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్న తన సహోదరి చేతలతో ఈయన చేతలు సమానంగా ఉన్నవనే ఆలోచనను తిరస్కరిస్తుంది. దీనికి విరుద్ధంగా, ఆ మనుష్యుడు కలిగియున్న ఆస్తిని మరియు పది ఒంటెలనొద్ద–ఆ రోజుల్లో ఒంటెలు చాలా అరుదైన మరియు విలాసవంతమైన ప్రయాణ సాధనాలు –నిలిచియున్న ఇతర మనుష్యులను చూచినప్పుడు, ఆయన కొంత దురాశతో ప్రేరేపించబడియుంటాడు (29 మరియు 31 అధ్యాయాలలో కూడా యాకోబు కథనములలో ఇదే లక్షణము ఇంకా స్పష్టమౌతుంది).

**వచనము 31.** ముందుగా, లాబాను ఆ దాసుని **యెహోవా** [దేవుని] **వలన ఆశీర్వదింపబడినవాడా** అని పిలవడం కొంత వింతగానే ఉంది, ఎందుకంటే దేవుని యొక్క పేరు ఆయనకు ఎలా తెలుసు?[11] దీనికి జవాబు రిబ్కా ఆ దాసుని గూర్చి అబ్రాహాము బంధువుల ఇంటికి (24:26–28) వారిని నడిపించిన "యెహోవాను" దేవునిగా ఆ మనుష్యుడు స్తుతించి ఆరాధించాడని తన యింటివారితో చెప్పింది. దీనికి తోడు, అట్టి బంగారు ఆభరణములు మరియు ఇతర వస్తువులతో నిండియున్న పది ఒంటెలను చూచినప్పుడు, ఆయన యొక్క సంపద దైవిక ఆశీర్వాదములకు సూచనగా ఉన్నాదని లాబాను అనుకున్నాడు (24:1 చూడండి). కాబట్టి ఆ మనుష్యుని **లోనికి రమ్ము ... ఇల్లును ఒంటెలకు స్థలమును నేను సిద్ధము చేయించితినని** బ్రతిమాలెను.

**వచనము 32.** ఈ ఆహ్వానమునకు బదులుగా, **ఆ మనుష్యుడు యింటికి వచ్చెను.** బెతూయేలు తన సొంత కుటుంబమునకు మాత్రమే కాక అబ్రాహాము యొక్క సేవకులకు మరియు ఒంటెలకు కూడా స్థలమును అదనంగా కలిగియుండడమంటే బహుశా ఐశ్వర్యవంతుడై ఉంటాడు. ఆ గృహములో చావిడిగా మరియు వాకిలిగా ఉన్న కొంత భాగములోనికి ఆ జంతువులను తీసికొని వెళ్లి ఉంటారు.

NASB అనువాదం **లాబాను ఒంటెల బరువును దింపి, [వాటికి] గడ్డిని**

**మరియు మేతను పెట్టి, [తమ] కాళ్లను కడుకొనుటకు** మనుష్యులకు **నీటిని** ఇచ్చాడని చెప్తుంది. హెబ్రీ వాక్యభాగంలో లాబాను పేరు లేదు కాబట్టి, ఈ క్రియల యొక్క కర్తను కనుగొనడం కష్టం. అటువంటి ఒక మనిషి తనంతట తానుగా ఒంటెల బరువును దింపి, ఆ పరదేశునికి మరియు ఆయనతో ఉన్న మనుష్యులు బస చేయుటకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు వ్యక్తిగతంగా చేయడం చాలా అసాధారణమైన విషయం. అతను కూడా విలువైన కొన్ని బహుమతులను వారినొద్ద నుండి పొందుకుంటాననే ఆశతో, వారిని ఆకట్టుకొనుటకు లాబాను ఇలా చేసి ఉంటాడు; లేదా తన అతిధులకు సరియైన ఏర్పాట్లు చేయుటకు తన దాసులను[12] ఆజ్ఞాపించుట ద్వారా ఆయన (లాబాను) వీటినన్నిటిని చేసియుంటాడు అని ఈ వాక్యభాగము సూచించవచ్చు.

**వచనము 33.** ఆ మనుష్యులు మరియు జంతువులకు కావాల్సిన ఏర్పాట్లను ముగించి తరువాత ఆచారణపరమైన కొన్ని కుశలములను అడిగిన తరువాత, తీవ్రమైన చర్చ జరిగే భోజనమునకు సమయము ఆసన్నమైంది. అయినప్పటికీ, ఆ యౌవనురాలైన చిన్నదానిని పరీక్షించే వరకు బావి వద్ద తనుగాని తన ఒంటెలు గాని నీళ్లు త్రాగరని అబ్రాహాము యొక్క దాసుడు అనుకున్నట్లుగానే, ఇప్పుడు ఆయన పని తన ప్రధానమైన దృష్టి. **అతనికి భోజనము పెట్టినప్పుడు దానిని తిని** తన ఆకలిని తీర్చుకొనుటకు నిరాకరించి ఆయన వచ్చిన **పనిని** గూర్చి **వారితో** చెప్పాడు. ఈ మనుష్యుడు తన పనిపట్ల కలిగియున్న సమర్పణను మెచ్చుకొనకుండా ఒకరు ఉండలేరు! అట్టి సుదూర ప్రయాణం తరువాత, తన సొంత ఆకలిని తీర్చుకొనుటకంటే, తన యజమానుడు ఆయనకిచ్చిన బాధ్యతను నెరవేర్చుటకే ఎక్కువ శ్రద్ధకలిగి యున్నాడు. కాబట్టి లాబాను, "**చెప్పుమనెను.**"

## దాసుని యొక్క కథ (24:34–49)

34–35**అంతట అతడిట్లనెను–నేను అబ్రాహాము దాసుడను, యెహోవా నా యజమానుని బహుగా ఆశీర్వదించెను గనుక అతడు గొప్ప వాడాయెను; అతనికి గొఱ్ఱెలను గొడ్లను వెండి బంగారములను దాస దాసీజనమును ఒంటెలను గాడిదలను దయచేసెను.** 36**నా యజమానుని భార్యయైన శారా వృద్ధాప్యములో నా యజమానునికి కుమారుని కనెను; నా యజమానుడు తనకు కలిగినది యావత్తును అతనికిచ్చి యున్నాడు;** 37**మరియు నా యజమానుడు నాతో–నేను ఎవరి దేశమందు నివసించుచున్నానో ఆ కనానీయుల పిల్లలలో ఒక పిల్లను నా కుమారునికి పెండ్లిచేయవద్దు.** 38**అయితే నా తండ్రి యింటికిని నా వంశస్థుల యొద్దకును వెళ్లి నా కుమారునికి పెండ్లి చేయుటకు ఒక పిల్లను తీసికొని రావలెనని నాచేత ప్రమాణము చేయించెను.** 39–40**అప్పుడు నేను నా యజమానునితో–ఆ స్త్రీ నావెంట రాదేమో అని చెప్పినందుకు అతడు–ఎవని సన్నిధిలో నేను**

**జీవించుచున్నానో ఆ యెహోవా నీతోకూడ తన దూతను పంపి నీ ప్రయాణము సఫలము చేయును గనుక నీవు నా వంశస్థులలో నా తండ్రి యింటనుండి నా కుమారునికి భార్యను తీసికొని వచ్చెదవు [41]నీవు నా వంశస్థులయొద్దకు వెళ్లితివా యీ ప్రమాణము విషయములో ఇక నీకు బాధ్యత ఉండదు, వారు ఆమెను ఇయ్యనియెడలకూడ ఈ ప్రమాణము విషయములో నీకు బాధ్యత ఉండదని చెప్పెను. [42]నేను నేడు ఆ బావి యొద్దకు వచ్చి–అబ్రాహామను నా యజమానుని దేవుడవైన యెహోవా, నా ప్రయాణమును నీవు సఫలము చేసినయెడల [43]నేను ఈ నీళ్లబావియొద్ద నిలిచియుండగా నీళ్లు చేదుకొనుటకు వచ్చిన చిన్నదానితో నేను– నీవు దయచేసి నీ కడవలో నీళ్లు కొంచెము నన్ను త్రాగనిమ్మని చెప్పునప్పుడు [44]– నీవు త్రాగుము నీ ఒంటెలకును చేది పోయుదునని యెవతె చెప్పునో ఆమెయే నా యజమానుని కుమారునికి యెహోవా నియమించిన పిల్లయై యుండును గాకని మనవిచేసికొంటిని. [45]నేను నా హృదయములో అట్లు అనుకొనుట చాలింపకముందే రిబ్కా భుజముమీద తన కడవను పెట్టుకొనివచ్చి ఆ బావిలోనికి దిగిపోయి నీళ్లు చేదుకొని వచ్చెను; అప్పుడు–నాకు దాహమిమ్మని నేనామెను అడుగగా [46]ఆమెత్వరగాతన కడవను దించి–త్రాగుము, నీఒంటెలకును నీళ్లుపెట్టెదనని చెప్పెను గనుక నేను త్రాగితిని; ఆమె ఒంటెలకును నీళ్లు పెట్టెను. [47]అప్పుడు నేను–నీవు ఎవరికుమార్తెవని యడిగినందుకు ఆమె–మిల్కా నాహోరునకు కనిన కుమారుడగు బెతూయేలు కుమార్తెని చెప్పినప్పుడు, నేనామె ముక్కుకు కమ్మియును ఆమె చేతులకు కడియములను పెట్టి [48]నా తలవంచి యెహోవాకు మ్రొక్కి, అబ్రాహామను నా యజమానుని దేవుడైన యెహోవాను స్తోత్రము చేసితిని; ఏలయనగా ఆయన నా యజమానునియొక్క సహోదరుని కుమార్తెను అతని కుమారునికి తీసికొనునట్లు సరియైన మార్గమందు నన్ను నడిపించెను. [49]కాబట్టి నా యజమానునియెడల మీరు దయను నమ్మకమును కనుపరచినయెడల అదియైనను నాకు తెలియచెప్పుడి, లేనియెడల అదియైనను తెలియచెప్పుడి; అప్పుడు నేనెటు పోవలెనో అటు పోయెదననగా**

**వచనములు 34, 35.** ఈ పరదేశి ఎవరో రిబ్కా కుటుంబమునకు ఇంకను తెలియకుండానే ఉంది, అందుకే అయన **అబ్రాహాము దాసునిగా** పరిచయం చేసుకున్నాడు. ఈ విధంగా ప్రారంభించుటచే, ఆయనతో తెచ్చిన సంపద అంతయు ఆయనది కాదనియు, అది అబ్రాహామునకు చెందిన సంపద అనియు వారు గుర్తించాలని ఆయన అనుకున్నాడు.

ఇంకా **యెహోవా** [ఆయన] **యజమానుని** సమృద్ధియైన ఐశ్వర్యంతో **బహుగా ఆశీర్వదించెను** (24:1) అని, **అతనికి గొఱ్ఱెలను గొడ్లను వెండి బంగారములను దాస దాసీజనమును ఒంటెలను గాడిదలను దయచేసెను** అని వారు తెలుసుకోవాలని ఆయన అనుకున్నాడు. దేవుడు తన యజమానుని "బహుగా ఆశీర్వదించెను" అని

దాసుడు అన్నప్పుడు, అబ్రాహామును "ఆశీర్వదించి" తన నామమును "గొప్ప చేసి," మరియు ఆయన నుండి "గొప్ప జనమును" చేసెదను అని యెహోవా చేసిన వాగ్దానములో (12:2) ప్రయోగించిన భాషను పోలినదిగా ఉంది. తన యజమానుని దేవుని యందు ఒక నిజమైన విశ్వాసిగా ఆయన అయ్యాడు అని దాసుని మాటలు వెల్లడి చేస్తున్నాయి. సంపదను ప్రస్తావించిన పైనము తన సహోదరికి యోగ్యుడైన పెనిమిటిని సమకూర్చుటకు గల సామర్థ్యతలో లాబానునకు గొప్ప ఆసక్తి కలిగించి ఉంటుంది. ఈ కుటుంబమునకు తన పనిని గూర్చి మరి ఎక్కువ సమాచారము ఇచ్చుటకు నేపథ్య పని అంతయు చేయబడింది.

**వచనము 36.** వాస్తవానికి, "గొప్ప జనముగా" నిన్ను చేస్తానని దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన వాగ్దానము, అసలు ఈ దాసుడు కనాను నుండి హారానునకు ఇంతటి భారమైన ప్రయాణమును ఎందుకు చేపట్టాడో అనేదాన్ని వివరిస్తుంది. ఈ కుటుంబమునకు దాసుడు **తన యజమానుని భార్యయైన శారా** ఆయనకు **తన వృద్ధాప్యములో** ఒక **కుమారుని** కన్నది (17:17; 21:2, 7) అని తెలిపాడు. రిబ్కా ఇస్సాకు కంటే కూడా తరువాతి తరములో భాగమైనప్పటికి (24:24; 25:20 చూడండి), రిబ్కాను వివాహమాడుటకు అబ్రాహాము యొక్క కుమారుడు తగినంత యౌవనుడు అని బయలుపరుస్తుంది గనుక ఈ వ్యాఖ్య చాలా ప్రాముఖ్యమైనది. తనకున్న యావదాస్తికి అబ్రాహామునకు ఉన్నది ఒకే వారసుడు, మరియు ఆయనకున్న యావత్తును **ఆయనకిచ్చియున్నాడు** అని ఇక్కడ ఉద్ఘాటన.

అబ్రాహాము "యావత్తును ఆయనకిచ్చియున్నాడు" అనే ఈ మాట యొక్క అర్థతను పరిశీలించాలి. అబ్రాహాము ఇష్మాయేలుకును మరియు కెతూరా ద్వారా ఆయనకు కలిగిన కుమారులకు బహుమతులు ఇచ్చాడని (25:1, 6) తరువాతి అధ్యాయం బయలుపరుస్తుంది.[13] అయినప్పటికీ, ఆయన బ్రతికియుండగానే వారికీ ఈ విధంగా ఇచ్చి వారిని పంపివేశాడు. ఆయన మరణము తరువాత అబ్రాహాము సంస్థానమునకు ఇస్సాకు మాత్రమే ఏకైక వారసుడు (21:10 చూడండి). ఒకవేళ రిబ్కా ఇస్సాకుకు వివాహమందు ఇవ్వబడితే, ఆమె గొప్ప ఐశ్వర్యమును అనుభవిస్తూ లేమి లేకుండా ఉంటుందని ఈ సమాచారము ఆ కుటుంబమునకు ఒక పునఃనిశ్చయత కలిగిస్తుంది.

**వచనములు 37, 38.** తన యజమానుడు [ఆయన] **కుమారునికి ఒక భార్యను** వారు జీవిస్తున్న **దేశంలో** ఏ ఒక్క కనానీయుల స్త్రీలలో ఒకదానిని గాని తీసుకురాడని [ఆయనతో] **ప్రమాణము చేయించుకున్నట్లు**గా దాసుడు వివరించాడు. దీనికి బదులు, ఆ దాసుడు [ఆయన] **తండ్రి యింటికి** మరియు **బంధువుల యింటికి** వెళ్లి [ఆయన] **కుమారునికి ఒక భార్యను తీసుకురావాలని** అబ్రాహాము దాసునితో చెప్పాడు (24:2–4 చూడండి).

**వచనములు 39, 40.** ఒకవేళ **ఆ స్త్రీ** తనతో కనానుకు **వెళ్లుటకు** ఇష్టపడని

యెడల తన కార్యము విఫలము అవుతుందని తన యజమానునితో చెప్పినట్లుగా దాసుడు రిబ్కా కుటుంబమునకు చెప్పాడు. ఈ కార్యము దైవికమైన కార్యము అని యజమానుడు చెప్పి, **యెహోవా తన ప్రయాణము సఫలము** చేయుటకు **తన దూతను** పంపిస్తాడు అని ఉద్ఘాటించాడు (24:5–7 చూడండి).

ఈ వాక్యములో ఆశక్తికరమైన విషయం ఏమంటే, అబ్రాహాము ఇచ్చిన ఆజ్ఞను చెప్తూనే ఈ దాసుడు పితరుని యొక్క సొంత మాటలను అలానే చెప్పాడు. ఇతర సమయాలలో, తన యజమానుని మాటల సారాంశంను మాత్రమే చెప్పాడు. ఇలా దాసుడు యజమానుని యొక్క అసలైన మాటలను చెప్పుట ద్వారా, కనానీయులలో నుండి కాక [అబ్రాహాము] **కుమారునికి** [ఆయన] **బంధువులలో**, ఆయన తండ్రి యింటి నుండి **భార్యను తెచ్చుటకు** దేవుని చిత్తమైనదని కుటుంబము తెలుసుకుంది. ఆ పరదేశియైన దాసుడు వారి యింటిని కనుగొనడం అనేది యాదృచ్ఛికము కాదనే అవకాశాన్ని వారు ఆలోచించునట్లు ఇది చేసింది. రిబ్కాను కనుగొనుటకు యెహోవ యొక్క దూత ఆయనను నడిపించి ఉంటుంది.

**వచనము 41.** ఈ విషయంలో ఎటువంటి బలవంతమును చేయవద్దని ఆయన యజమానుడు చెప్పినట్లు ఈ మనుష్యుడు వారికి చెప్పినప్పుడు వారు ఇంకా ఆకర్షించబడి యుంటారు. రిబ్కాను పంపుటకు తిరస్కరించుటకు కూడా ఆ కుటుంబమునకు అవకాశం ఇవ్వబడింది, అట్టి పరిస్థితిలో ఆ సేవకుడు అబ్రాహామునకు [ఆయన] చేసిన **ప్రమాణము నుండి విడుదల పొందుతాడు** (24:8 చూడండి).

**వచనములు 42–44.** ఇస్సాకు మరియు రిబ్కాల మధ్య వివాహము ఆశించదగినది మరియు దైవకృతమైన దేవుని కార్యమునకు అనుగుణముగా ఉన్నదని అనుటకు కారణాలను చర్చించిన తారువాత, ఆయన యొక్క కార్యము **సఫలము** అవుతుందో లేదో అని దాసుడు తెలుసుకొనుటకు ఆతురతగా ఉన్నాడు. ప్రార్థనతో ప్రారంభించి ఆయనకు ఆ బావి దగ్గర జరిగినదంతా వారికీ చెప్పాడు (24:10–14 చూడండి).

43వ వచనంలో, దాసుడు రిబ్కాను కలిసినప్పుడు మునుపు ఉన్న కథనముతో పోలిస్తే ఇక్కడ కథనములో ఒక చిన్న వ్యత్యాసము ఉంది. 24:16లో ఆమె “కన్యక”గా (בְּתוּלָה, *bethulah*) పిలువబడియుండగా, ఇక్కడ ఆమెను దాసుడు **చిన్నది** (עַלְמָה, *‘almah*) అని సంబోధించాడు. రిబ్కాను ప్రస్తావించుటకు అనేక పదములు వాడబడియుండగా, ఈ సందర్భంలో ఈ రెండు పదములు కూడా ఆ “అమ్మాయి” (24:14) కన్యక అనే విషయమును సూచిస్తున్నవి. వాస్తవంగా, ఏ పురుషునితో కూడా ఆమెకు లైంగిక సంబంధములులేనట్లుగా ఇక్కడ చెప్పబడింది (24:16). ఇది చాలా ప్రాముఖ్యం, ఎందుకంటే లైంగికపరంగా పరిశుద్ధంగా ఉన్న భార్యనే ఇస్సాకు కనుగొనడం ఇక్కడ అన్వేషణ.

**వచనములు 45, 46.** తన యొక్క ప్రతి ఆశను రిబ్కా ఎలా నెరవేర్చిందో ఈ

దాసుడు సంతోషంగా చెప్పాడు (24:15–21 చూడండి). ఇక్కడ వాస్తవాలు స్పష్టంగా ఉన్నాయి, మరియు రిబ్కా వారితో కూడా కనాను వెళ్లుటకు ఆ కుటుంబము పంపేటట్లు వారిని ప్రేరేపించులాగున ఈ వాస్తవాలను అలంకరించుటకు లేదా మార్చి చెప్పుటకు ఈ మనుష్యునికి ఎటువంటి అవసరత లేదు.

**వచనము 47.** ఆమెతో దాసుడు కలుచుటను గూర్చిన వివరములను రిబ్కా కుటుంబమునకు దాసుడు చెప్తుండగా, మునుపటి కథనముతో పోలిస్తే ఈ కథనము ముగింపులో మరియొక వ్యత్యాసము కనబడుతుంది. మునుపటి కథనంలో, ఆ స్త్రీ యొక్క వంశావళి మరియు తన మనుష్యులకు మరియు ఒంటెలకు వారి ఇంటిలో బసచేయుటకు స్థలము ఉన్నదా అని విచారించే ముందే ఆ చిన్నదానికి దాసుడు కడియములను మరియు ముక్కు కమ్మిలను ఇచ్చినట్లుగా చదువుతాం (24:22). ఈ సంఘటనలను వివరించే క్రమంలో, వారికీ అక్కడ ఏర్పాట్లు చేయుటకు వీలు ఉంటుందా అని ఆమెను అడిగిన విషయమును దాసుడు ఇక్కడ ప్రస్తావించలేదు. మరీ వారిని బలవంతం చేసినట్లుగా గాని లేదా వారిని ఆహ్వానించినవారికి ఇబ్బందిని కలిగించినట్లుగా గాని అగుపడకుండా దాసుడు ఇక్కడ కొంచెం వివేకమును ప్రయోగించాడు.

ఇంకా, ఈ కథనములో ఏదో పొరపాటు ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఆ యౌవన స్త్రీ యొక్క గుర్తింపు బయలుపరచక ముందే బహుమతులు ఇచ్చినట్లుగా కథకుడు తెలిపాడు (24:22), కాని ఇక్కడ దాసుని వృత్తాంతము సంఘటనల క్రమమును మారుస్తుంది. తన వంశమును గూర్చి తెలుసుకున్న తరువాతనే ఆభరణములను గూర్చి ప్రస్తావించాడు. ఇక్కడ అంత నిజమైన వైరుధ్యం ఏమి కనబడదు, ఈ రెండు కథనములలో ఉన్న వ్యత్యాసము అవి ప్రయోగించిన క్రియా రూపములలో మాత్రమే. అక్కడ కథనము చెప్తుంది, ఆభరణములను "ఆ మనుష్యుడు తీసి" అని (24:22), కాని ఇక్కడ దాసుడు **నేనామె ముక్కుకు కమ్మియును ఆమె చేతులకు కడియములను** పెట్టాను అని అంటున్నాడు. మొదట ఆ బహుమతులను బయటకు ముందుగా తీసి, అప్పుడు తన తండ్రి యొక్క వంశావళిని గూర్చి ప్రశ్నించి, ఆమె యొక్క వారసత్వము మరియు అబ్రాహాముతో ఆమె సంబంధము తెలుసుకొననంత వరకు ఆమెపై ఆ ఆభరణములను వాస్తవంగా పెట్టలేదు అని ఆలోచించడం సాధ్యం.[14] మొత్తంలో ఈ దాసుని కార్యమునకు, అనగా అబ్రాహాము యొక్క "తండ్రి యింటి నుండి" ఇస్సాకునకు సాటియైన భార్యను కనుగొనడం (24:38, 40) అనే పనికి, ఆ కుటుంబము యొక్క గుర్తింపు చాలా ప్రాముఖ్యం. ఒకవేళ రిబ్కా వేరే వంశమునకు చెందిన చిన్నది అయిన యెడల బహుశా ఆ విలువైన ఆభరణములు ఆమెకు ఇవ్వబడేవి కావేమో.

**వచనము 48.** ఆ ఊట యొద్ద యౌవన స్త్రీతో ఆయన ఏమి మాట్లాడాడో దాసుడు కుటుంబమునకు సారాంశంగా తెలిపాడు: **యెహోవా … నా యజమానునియొక్క సహోదరుని కుమార్తెను అతని కుమారునికి తీసికొనునట్లు**

**సరియైన మార్గమందు నన్ను నడిపించెను** (24:27 చూడండి).

**వచనము 49.** ఆఖరు విన్నపముతో ఈ మనుష్యుడు ముగించాడు. ఆయన కేవలం లాబానుతో మాత్రమే కాక బెతూయేలు మరియు రిబ్కా యొక్క ఇతర కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడుతున్నట్లుగా హెబ్రీ వాక్యభాగము తెలుపుతుంది. **నా యజమానునియెడల *మీరు* దయను నమ్మకమును కనుపరచినయెడల అదియైనను** [*మీరు*] **నాకు తెలియచెప్పుడి, లేనియెడల అదియైనను** [*మీరు*] **తెలియచెప్పుడి** (వక్కాణం జోడించబడెను) అని దాసుడు చెప్పినప్పుడు ద్వితీయా విభక్తి పుంలింగం బహువచనంలో ఉన్న మూడు క్రియారూపములను ఈయన వాడుతున్నాడు. ఈవిధంగా, ఇస్సాకుతో రిబ్కాకు సాధ్యపడే భవిష్యత్తును గురించి ఆ కుటుంబమును ఆయన అడుగుతున్నాడు.

అబ్రాహాము కుమారునితో రిబ్కా వివాహము చేసుకొనుట అనునది దేవుని యొక్క సంకల్పం అని చూపుటకు ప్రేరణాత్మకమైన ఆధారము చూపబడింది. లాబాను మరియు బెతూయేలులు తడవు చేయాలని ఆయన అనుకొనలేదు; కాని ఆయన **కుడికి తిరుగవలెనో లేక ఎడమకి తిరుగవలెనో** నిర్ణయించుకొనుటకు వారు త్వరగా తమ నిర్ణయమును తెలుపాలని ఆశించాడు. ఒకవేళ వీరు దాసుని విన్నపమును నిరాకరించిన యెడల ఈ దాసుడు కావలసిన భార్య కొరకు వేరొక ప్రదేశంలో వెదుకుతాడని ఈ వాక్యం తెలుపుతుందని కొందరు అంటుంటారు. అయితే, అట్టి ఆలోచన అబ్రాహాము యొక్క ఆజ్ఞకును మరియు ఆ దాసుని ప్రార్థన ఆలకించుట ద్వారా దేవుని యొక్క నడిపింపుకును విరుద్ధంగా ఉంటుంది. రిబ్కాను బావివద్ద కలవడం అనునది దైవానుగ్రహం వలన కలిగినదిగా దాసుడు బలంగా నమ్మాడు. సరైన కుటుంబమునకు చెందిన సరైన వ్యక్తిని కలుచుటకు దేవుడు సరైన సమయంలో సరైన స్థలము దగ్గరకు నడిపించాడు, మరియు ఇదంతయు ఆయన వాగ్దానమును నెరవేర్చుటకు చేసినదే. ఇంత జరిగినప్పటికీ, దేవుడు రిబ్కా కుటుంబము యొక్క అభీష్టమును మీరడని గ్రహించాడు, అలాగే ఆమెపై గాని ఆమె కుటుంబముపై గాని అనుకూలమైన నిర్ణయమును ఆయన బలవంతము చేయకూడదని కూడా గ్రహించాడు. "కుడికి తిరుగవలెనో లేక ఎడమకి తిరుగవలెనో" అనే భావము వారికి చెప్పిన ఈ విషయము ఎక్కడవరకు వచ్చింది మరియు ఆచోట నుండి ముందుకి ఆయన ఎలా వెళ్లాలో అనుదానికి ఆయన చెప్పే విధానంగా ఉన్నది.

## ప్రయాణము యొక్క విజయము (24:50–61)

**50 లాబానును బెతూయేలును–ఇది యెహోవావలన కలిగిన కార్యము; మేమైతే అవుననిగాని కాదనిగాని చెప్పజాలము; 51 ఇదిగో రిబ్కా నీ యెదుట నున్నది, ఆమెను తీసికొని పొమ్ము; యెహోవా సెలవిచ్చిన ప్రకారము ఈమె నీ యజమానుని**

**కుమారునికి భార్య అగునుగాకని ఉత్తరమిచ్చిరి. [52]అబ్రాహాము సేవకుడు వారి మాటలు విని యెహోవాకు సాష్టాంగ నమస్కారము చేసెను. [53]తరువాత ఆ సేవకుడు వెండి నగలను బంగారు నగలను వస్త్రములను తీసి రిబ్కాకు ఇచ్చెను; మరియు అతడు ఆమె సహోదరునికిని తల్లికిని విలువగల వస్తువులు ఇచ్చెను. [54]అతడును అతనితోకూడనున్న మనుష్యులును అన్నపానములు పుచ్చుకొని అక్కడ ఆ రాత్రియంతయు నుండిరి. ఉదయమున వారు లేచినప్పుడు అతడు–నా యజమానుని యొద్దకు నన్ను పంపించుడని చెప్పగా [55]ఆమె సహోదరుడును ఆమె తల్లియు–ఈ చిన్నదాని పదిదినములైనను మాయొద్ద ఉండనిమ్ము, ఆతరువాత ఆమె వెళ్లవచ్చుననిరి. [56]అప్పుడతడు–యెహోవా నా ప్రయాణమును సఫలము చేసెను గనుక నాకు తడవు కానీయక నన్ను పంపించుడి, నా యజమానునియొద్దకు వెళ్లెదనని చెప్పినప్పుడు [57]వారు–ఆ చిన్నదానిని పిలిచి, ఆమె యేమనునో తెలిసికొందమని చెప్పుకొని [58]రిబ్కాను పిలిచి–ఈ మనుష్యునితోకూడ వెళ్లెదవా అని ఆమె నడిగినప్పుడు–వెళ్లెద ననెను. [59]కాబట్టి వారు తమ సహోదరియైన రిబ్కాను ఆమె దాదిని అబ్రాహాము సేవకుని అతనితో వచ్చిన మనుష్యులను సాగనంపినప్పుడు [60]వారు రిబ్కాతో మా సహోదరీ, నీవు వేల వేలకు తల్లి వగుదువు గాక, నీ సంతతివారు తమ పగవారి గవినిని స్వాధీనపరచుకొందురుగాక అని ఆమెను దీవింపగా [61]రిబ్కాయు ఆమె పనికత్తెలును లేచి ఒంటెల నెక్కి ఆ మనుష్యుని వెంబడి వెళ్లిరి. అట్లు ఆ సేవకుడు రిబ్కాను తోడుకొని పోయెను.**

**వచనము 50.** దాసుడు కనుబరచిన స్పష్టమైన త్రికరణ శుద్ధిని చూచిన తరువాత మరియు ఆయన యొక్క శక్తివంతమైన సాక్ష్యమును వినిన తరువాత **లాబాను మరియు బెతూయేలు** అనువారు ఈ విషయములన్నిటిలో దేవుని హస్తము ఉన్నదని గ్రహించారు. కాబట్టి వారు అన్నారు, **మేమైతే అవుననిగాని కాదనిగాని చెప్పజాలము** (31:24, 29, 2 సమూ. 13:22 చూడండి). NIV ఈ మాటను ఆధునిక పరిభాషలో అనువదిస్తుంది: “ఈ దారి అనిగాని ఆ దారి అనిగాని మేము నీకు ఏమీ చెప్పలేము.”

**వచనము 51.** ఈ వ్యవహారములన్నిటి ద్వారా దేవుడు మాట్లాడియుంటే, మానవులు అభ్యంతరపరచుటకు చాలా తక్కువ అవకాశము ఉంటుంది; అందుకే ఆ దాసునితో వారు **ఇదిగో రిబ్కా నీ యెదుట నున్నది, ఆమెను తీసికొని పొమ్ము; యెహోవా సెలవిచ్చిన ప్రకారము ఈమె నీ యజమానుని కుమారునికి భార్య అగునుగాకని ఉత్తరమిచ్చిరి.**

ఈ నిర్ణయము తీసుకొనుటలో లాబాను మరియు బెతూయేలుకు ఉన్న వాస్తవమైన కారణాలను గూర్చి చాలా సాధ్యపడే వివరణలు ఉన్నాయి. మొదటిగా, ఈ విషయములో (అబ్రాహాము యొక్క దేవుడైన) “యెహోవా”కును మరియు

ఆయన చిత్తమునకును నిజమైన గౌరవమును వ్యక్తపరచే అచ్చమైన ఒప్పుకోలును ఈ మాట మనకు తెలియజేస్తుంది. రెండవదిగా, అబ్రాహాము యొక్క దాసుడు ఆయన వద్దనున్న తన ఐశ్వర్యమును వారికి చూపించుట ద్వారా వారిని ఆశ్చర్యపరచి ఉంటాడు; బహుశా రిబ్కాకు దాని నుండి ఎక్కువ భాగాన్ని ఓలిగా పొందాలని వారు అనుకొనియుంటారు. ఆఖరుగా, అబ్రాహాము యొక్క దేవునికి వారు భయపడి ఉంటారు. ఆ దాసుని విన్నపమును తిరస్కరించి ఆయన చిత్తమునకు తలొగ్గని యెడల వారిపై పగనుతీర్చుకునే లేదా తీర్చుకుంటాడని నమ్మే వారి సొంత మెసొపొతమియ దేవుళ్ల వలె (31:19, 30) అబ్రాహాము దేవుడు కూడా ఆలాటివాడేనెమో అని వారు ఊహించి ఉంటారు. లాబాను మరియు బెతూయేలు అనువారలు ఇస్సాకును వివాహమాడుటకు కనాను దేశమునకు దూర ప్రయాణమును తీసుకొనుటకు గాను రిబ్కాను అనుమతించుటలో ఈ కారణాలలో ఒకటి గాని, లేదా అన్నీ కాని ఉండి ఉంటాయి. ఈ ఇద్దరు మనుష్యులు ఏమి చెప్పారో మాత్రమే ఈ వాక్యభాగము చెప్తుంది, కాని వారి హృదయములలో ఉన్నదానిని చెప్పుటలేదు.

**వచనము 52.** కథలో మూడవ సారి, సేవకుడు దేవునిని ఆరాధించెను. మొదటి సారి ఇస్సాకునకు సరిపోయిన భార్యగా దేవుడు ఏర్పరచిన యువతిని కనుగొనుటలో విజయమును గూర్చిన అతని ప్రార్థన (24:12–14). రెండవ సారి, అతని యజమాని యొక్క బంధువుల ఇంటికి దేవుడు నడిపించినందుకు దేవునికి సాష్టాంగపడి కృతజ్ఞతలు చెల్లించుట (24:26, 27). మూడవ సారి **సేవకుడు** ప్రార్థించినప్పుడు, తన యజమానుని కుమారునికి రిబ్కా భార్య అగునట్లు తనతో కనానుకు తిరిగి వెళ్లేందుకు లాబాను బెతూయేలు యొక్క అనుమతి పొందినందున విధేయతా మరియు స్తుతులతో **అతడు యెహోవాకు సాష్టాంగ నమస్కారము చేసెను.**

**వచనము 53.** ఒప్పందము చేసినప్పుడు, అబ్రాహాము **సేవకుడు** విలువగల **వెండి నగలను మరియు బంగారు నగలను, మరియు వస్త్రములను రిబ్కాకు** ఇచ్చెను. సేవకుడు యువతికి ఇచ్చిన ముక్కు కమ్మి మరియు బంగారు కడియములతో పాటు (24:22, 47), అతను ఇప్పుడు అదనపు వెండి మరియు బంగారు వస్తువులను, అలాగే విలువగల దుస్తులను ఆమెకు సమర్పించెను. ఇవన్నీ మరింత ఔదార్యమును ప్రదర్శించుటకును మరియు రిబ్కా ఇంటిని విడిచి ఇస్సాకును వివాహము చేసుకొనుటకు ప్రోత్సహించుటకును అయ్యుండవచ్చు.

సేవకుడు **తన సహోదరునికి మరియు తన తల్లికి కూడా విలువైన వస్తువులను ఇచ్చెను.** కుటుంబమునకు "ఓలియు కట్నమును" (מֹהַר, *mohar*)[15] ఇచ్చుట అనునది పురాతన మధ్య ప్రాచ్య ప్రాంతములో ఒక సాధారణ పద్ధతి. వరుని కుటుంబ సంపద ఆధారముగా, కుమార్తె నష్ట పరిహారముగా చెల్లించే విలువైన బహుమతులు కూడా యిందులో ఇమిడియుంటుంది. ఒక సాధారణ పనివాడు సంపాదించే అనేక

సంవత్సరాల సంపాదనకు సమానంగా చెల్లించిన మొత్తం ఉంటుంది (29:18–20 చూడండి).[16] లాబానుకు మరియు రిబ్కా తల్లికి ఇయ్యబడిన “విలువైన వస్తువులు” ఓలియు కట్నముగాను ఉండవచ్చు.

**వచనము 54.** సుదీర్ఘ చర్చ పూర్తయ్యింది, మరియు అబ్రాహాము కుమారునికి వధువుగా కనాను వెళ్లుటకు రిబ్కాకు ఏర్పాట్లు ఖరారు చేశారు. అప్పుడు సేవకుడు మరియు తన **మనుష్యులు తినిరి మరియు త్రాగిరి మరియు** రిబ్కా కుటుంబముతో **ఆ రాత్రి గడిపిరి.** సహజముగా, సేవకుడు తన యజమానునితో శుభవార్తను పంచుకొనుటకు, కనానుకు వెళ్లేందుకు ఆశక్తి చూపాడు. తుదకు, అతను ఒకవేళ ఒక నెల లేదా అంతకన్నా ఎక్కువ ఉండుటకు వెళ్లియుండవచ్చు. **ఉదయమున వారు లేచినప్పుడు, నా యజమానుని యొద్దకు నన్ను పంపించుడి** అని సేవకుడు చెప్పెను.

వెంటనే విడచిపోవుటకు సేవకుడు చేసిన అభ్యర్థన కరుకైనదా లేదా మర్యాదతో కూడినదా? ఆయనది కరుకైన ప్రతిపాదన అనుటకు అనుకూలముగా వాదన ఏమిటంటే “దయచేసి, నా యజమానుని యొద్దకు నన్ను పంపించుడి” అని అతడు అనలేదు. వెళ్లిపోవుటకు అభ్యర్థన కన్నా త్వరగా విడిచిపోతాము అనునది పట్టుబట్టినట్లున్నది.[17] ఒక మర్యాద మేరకు అనుకూలముగా అతనిని పంపివేయమని వారిని అడుగుట వాస్తవముగా సేవకుడు వారి ఆధీనములో ఉన్నట్లు సూచిస్తుంది. రిబ్కాను అతనితో కూడా కనాను వెళ్లుటకు సిద్ధపరచుటలో వారు సహాయపడవలెనని అడుగుటకు ఇది బహుశా ఒక మర్యాదపూర్వకమైన మార్గం.[18] మనకు సేవకుని యొక్క స్వరము తెలియదు గనుక, అతని మాటలో స్వల్పభేదాన్ని చూచుటకు ఏవిధమైన మార్గమూ లేదు. సేవకుని యొక్క అభ్యర్థన మర్యాదపూర్వకమైనదిగానే ఉందని అనిపిస్తుంది. ఈ వ్యవహార క్రమములో ఒకవేళ అతడు మరీ మొండిగా ప్రవర్తించి లాబానుతోను రిబ్కా యొక్క తల్లితో ఆగ్రహపడితే, అతడు తన యొక్క పని మొత్తం సాఫల్యమొందించుటలో విఫలమయ్యేవాడు.

**వచనము 55.** ఈ విధమైన ఒక తొందరపాటుతో కూడిన నిష్క్రమణ ఆలోచన స్పష్టముగా రిబ్కా యొక్క కుటుంబమును ఇబ్బందిపెట్టింది. ఆమెను మళ్ళీ ఎన్నడూ చూడరని తెలుసుకొని, వారు ఆమెను కనానుకు వెళ్లకముందు **కొన్ని దినములు** – ఒకవేళ ఇంకా **పది** – అక్కడ ఉండమని కోరిరి.

**వచనము 56.** అయితే, **యెహోవా నా ప్రయాణమును సఫలము చేసెను గనుక నాకు తడువు కానీయక** ఇస్సాకునకు సరైన భార్యను కనుగొనుట అను తన పనిని దేవుడు దీవించెను, మరియు ఇప్పుడు తిరిగి ఇంటికి వెళ్లుటకు సమయము. జాగుచేస్తే రిబ్కా మరియు లేదా ఆమె తల్లిదండ్రులు వారి మనస్సు మార్చుకొనుటకు సమయమగునేమో అనునది మరొక పరిశీలన సేవకుని యొక్క నిర్ణయాన్ని ప్రభావితం చేసి ఉండవచ్చు. ఇది తన పని యొక్క అపజయానికి కారణమౌతుంది. రెండవసారి, **నన్ను పంపించుడి, నా యజమానునియొద్దకు వెళ్లెదను** అని అతడు

చెప్పెను

**వచనము 57.** వేగముగా పంపించమని మరలా చేసిన ఈ అదనపు అభ్యర్థనలో కూడా, రిబ్కా అంత త్వరగా విడచి వెళ్లవలసిన అవసరత ఉన్నదని లాబాను మరియు అతని తల్లి ఒప్పుకొనలేదు. ఆమె వెంటనే విడిచి అబ్రాహాము సేవకులతో కనాను వెళ్లుటకు సిద్ధమో కాదో అని చూచుటకు **ఆ చిన్నదానిని పిలిచి మరియు సంప్రదించుటకు** వారు నిర్ణయించుకున్నారు.

**వచనము 58.** సహజముగా అతని సహోదరికి ఇంటితో ఉన్న బంధము ఆమె ఆలస్యమునకు కారణమవుతుందని లాబాను బాగా అలోచించియుండవచ్చు. అందుచేత, ఆమె **వెళ్లుటకు** సిద్ధమా అని వారు **రిబ్కాను** అడిగినప్పుడు: **నేను వెళ్లెదను** అను వేగిరమైన జవాబు వారికి ఆశ్చర్యమును కలిగించియుండవచ్చు. సేవకుని మాటలు సత్యమని మరియు ఇది దైవిక పిలుపని ఆమెకు రూఢియైనది. ఆమె భవితవ్యం హారానులో ఉన్న ఆమె కుటుంబముతో కాదనీ ఇస్సాకునకు భార్యగా దూరముగానున్న కనానులో అని ఆమె తెలుసుకొన్నది. ఈ తీర్మానముతో, చాలా సంవత్సరములకు ముందు మెసొపొతమియ నుండి అబ్రాహాము పిలుపును గుర్తుచేసే విధముగా తన విశ్వాసపు నడకను మొదలుపెట్టినది (12:1–5).

**వచనము 59.** రిబ్కా యొక్క దృఢమైన జవాబు కుటుంబమును ఆమె నిరుత్సాహపరచలేదని చూపుతుంది, కాబట్టి **వారు** [అయిష్టంగానే] **వారి సోదరియైన రిబ్కాను పంపివేసిరి.** ఈ సందర్భములో "సోదరి" అను పదప్రయోగము కొంతమందిని ఆలోచింపజేయవచ్చు. ఎందుకనగా ఆమె వీడ్కోలులో పాల్గొనేందుకు ఆమె తల్లీదండ్రులు చాలా బాధగా ఉండగా, రిబ్కా వెళ్లునప్పుడు తన తోబుట్టువులు మాత్రమే వీడ్కోలును తెలిపిరి. అయితే, ఇక్కడ "సోదరి" అను పదమును "స్త్రీ బంధువులుగా" బహుశా సాధారణ పద్ధతిలో ఉపయోగించియుండవచ్చు, అలాగే "సోదరుడు" అను పదము "పురుష బంధువుని" సూచిస్తుంది (13:8; 24:27). చాలా వరకు, ఆమె వెళ్తుండగా కుటుంబము మొత్తము ఆమె వీడ్కోలులో పాల్గొనియుండవచ్చు.

రిబ్కా చిన్నతనములో తనకు పాలిచ్చిన, తన సొంత వ్యక్తిగత దాదియైన దెబోరాతో (35:8) హాజరైనది.[19] ఇస్సాకు ఇంటిలో ఒక భార్యగా మరియు తల్లిగా క్రొత్త విధులలో సహాయపడుటకు, రిబ్కాకు ఇతర దాసీలు ("పనికత్తెలు"; 24:61) కూడా ఉన్నారు. రిబ్కా యొక్క దాది మరియు పనివారు ఆమె కుటుంబము ఇచ్చిన కట్నములోని ఒక భాగము అయ్యుండవచ్చు.[20] **అబ్రాహాము యొక్క సేవకులు మరియు అతని మనుష్యులు ఆ** పరివారమునకు తోడుగా ఉండి ప్రయాణములో రక్షణ కల్పిస్తారు.

**వచనము 60. రిబ్కా** వెళ్లకముందు ఆమె కుటుంబము రెండువిధాలైన దీవెనలు పలికెను. మొదటి భాగము **ఆమె వారసులు** విస్తరించి, **వేల వేలకు** అగుదురు. రెండవదిగా ఆమె సంతతి యుద్ధములో విజయం పొందును మరియు

**తమ పగవారి గవినిని స్వాధీనపరచుకొందురు.** అబ్రాహాముతో దేవుడు పలికిన అశీర్వాదములలో ఒకదానితో ఇది పోలిక కలిగి ఉంది: "నేను నిన్ను ఆశీర్వదించి ఆకాశ నక్షత్రములవలె సముద్రతీరమందలి ఇసుకవలెను *నీ సంతానమును నిశ్చయముగా విస్తరింపజేసెదను; నీ సంతతి వారు తమ శత్రువుల గవిని స్వాధీనపరచుకొందురు"* (22:17; వక్కాణం జోడించబడెను). వారసులకు సంబంధించి, దేవుడు "జనములకు తల్లి" అగునని చెప్పి శారాను ఆశీర్వదించెను (17:16).

**వచనము 61.** రిబ్కా పెళ్లి అబ్రాహాము యొక్క కుమారుని వివాహము చేసుకొనుట దేవుని చిత్తమని ఆమెను మరియు అమె కుటుంబమును ఒప్పించుట ద్వారా సేవకుడు అబ్రాహాము యొక్క ఆజ్ఞను హారానులో పూర్తి చేసాడు. ఆమె బందువుల ఆమోదము మరియు ఆశీర్వాదముతో, **రిబ్కాయు** మరియు **ఆమె పనికత్తెలు లేచి ఒంటెలనెక్కి ఆ మనుష్యుని వెంబడి కనానుకు సుదీర్ఘ ప్రయాణము చేయ వెళ్లిరి.** హారానుకు వివాహ బహుమతులు మోయుటకు ఉపయోగించిన ఒంటెలు (24:10) రిబ్కాను మరియు ఆమె పనికత్తెలను తిరుగు ప్రయాణములో తీసుకొని వెళ్లుటకు ఉపయోగపడెను.

## ఇస్సాకు మరియు రిబ్కాల వివాహము (24:62–67)

**62ఇస్సాకు బెయేర్ లహాయిరోయి మార్గమున వచ్చి దక్షిణ దేశమందు కాపురముండెను. 63సాయంకాలమున ఇస్సాకు పొలములో ధ్యానింప బయలువెళ్లి కన్నులెత్తి చూచినప్పుడు ఒంటెలు వచ్చుచుండెను. 64రిబ్కా కన్నులెత్తి ఇస్సాకును చూచి ఒంటెమీదనుండి దిగి 65మనలనెదుర్కొనుటకు పొలములో నడుచుచున్న ఆ మనుష్యుడెవరని దాసుని నడుగగా అతడు-ఇతడు నా యజమానుడని చెప్పెను గనుక ఆమె ముసుగు వేసికొనెను. 66అప్పుడా దాసుడు తాను చేసిన కార్యములన్నియు ఇస్సాకుతో వివరించి చెప్పెను. 67ఇస్సాకు తల్లియైన శారా గుడారములోనికి ఆమెను తీసికొనిపోయెను. అట్లు అతడు రిబ్కాను పరిగ్రహింపగా ఆమె అతనికి భార్య ఆయెను; అతడు ఆమెను ప్రేమించెను. అప్పుడు ఇస్సాకు తన తల్లి విషయమై దుఃఖనివారణపొందెను.**

**వచనము 62.** అధ్యాయము యొక్క మిగిలిన భాగములో, హారానుకు సేవకుడు వెళ్లిన పని యొక్క విజయవంతమైన ముగింపును రచయిత వివరించాడు. ఇంటి ప్రయాణమును గూర్చిన వివరములు ఇయ్యలేదు; వెళ్లిపోవుట (24:61) దగ్గర నుండి రాక (24:62–66) వరకు ఇక్కడ వివరణ దాటిపోయినది. సేవకుడు **ఇస్సాకును** ఎదుర్కొనినప్పుడు, అతడు **బెయేర్ లహాయిరోయి** సమీపములో **దక్షిణ దేశమందు జీవిస్తున్నాడు.** శారా నుండి ఆమె పారిపోవు సమయములో అక్కడే దేవుని దూత ఊట ద్వారా హాగరుకు ప్రత్యక్షమైనది (16:7,

14).

లేఖనములో చివరిగా ఉపయోగించిన కనాను స్థలం మమ్రే లేదా శారాను పాతిపెట్టినటువంటి హెబ్రోను (23:19) కాబట్టి ఈ ప్రదేశము ప్రశ్నలను లేవనెత్తుతుంది. (1) ఇస్సాకు తన తండ్రియైన అబ్రాహామును విడిచెనా? ఇస్సాకు యొక్క గొర్రెలు మరియు మందలు ఎక్కువగా పెరగటం వలన చాలా సంవత్సరములకు ముందు లోతు చేసినట్టు (13:5–12) తన తండ్రి యొద్ద నుండి వేరగుటకు బలవంతపెట్టబడియుండవచ్చు. మరొక సాధ్యత ఏమిటంటే ఇస్సాకుకు తన తండ్రి మరియు అతని క్రొత్త భార్య, కెతూరాలకు (25:1) దగ్గరగా జీవించకూడదని నిర్ణయించుకొని ఉండవచ్చు. (2) అబ్రాహాము మరియు ఇస్సాకులు ఇద్దరూ కలిసి వెళ్లారా? కాలము మారినందున ఇతర ప్రాంతాలలో వారి గొర్రెల మందలకు పచ్చిక కావలెనని వారు హెబ్రోనును వదిలియుండవచ్చు (13:3, 4 యొక్క వివరణను చూడండి). ఈ సందర్భములో, ఈ భాగములో అబ్రాహాము పేర్కొనబడలేదు ఎందుకంటే ఇస్సాకు మరియు తన క్రొత్త వధువుపై మాత్రమే దృష్టి కలిగి ఉంది. తన తండ్రి నేపథ్యములోనికి జారుకొనగా, ఇస్సాకు ఈ కథలో అతి ప్రాముఖ్యమైన వ్యక్తిగా మారాడు.

అబ్రాహామును గూర్చిన సూచనలు లేనందున సేవకుడు హారాను నుండి తరిగి వచ్చిన సమయానికే మూల పురుషుడు మరణించి యుండవచ్చు అను భావన కలుగవచ్చు. అయితే, ఈ ఆలోచన వాక్యములో ఇవ్వబడిన గణాంకాలతో సరిపోవడం లేదు, అవి ఇస్సాకు మరియు రిబ్కా వివాహము తరువాత అబ్రాహాము మరో ముప్పై ఐదు సంవత్సరాలు జీవించెనని తెలుపుచున్నవి (24:1 వివరణ చూడండి).

**వచనము 63.** ఇప్పటి వరకూ, **ఇస్సాకును** గూర్చి కొంచెమే తెలుపబడెను; కానీ అతడు "నలభై సంవత్సరముల వయస్సు" గలవాడైనప్పుడు (25:20), **సాయంకాలము పొలములోనికి ధ్యానము నిమిత్తమై అతడు వెళ్లెనని** వాక్యము చెప్తుంది. పాత నిబంధనలో ఇక్కడ మాత్రమే שׂוּחַ (*śuach*) అను పదమును కనుగొనగలము, కాబట్టి దాని అర్థము అస్పష్టముగా ఉన్నది. సూర్యుడు అస్తమించునప్పుడు ఇస్సాకు ఏమి చేయుచుండెను? ఏకాభిప్రాయము లేనందువలన, బహుశ ఆ పదమునకు అర్థము "ధ్యానించుట" (KJV; NIV; ESV) లేదా "ప్రార్థించుట."[21] వారి బంధువులలో నుండి అతనికి భార్యను తెచ్చుటకు అతని తండ్రి అతి నమ్మకస్తుడైన సేవకుని హారానుకు పంపెనని అతనికి తెలుసు. వెళ్లిన పని విజయవంతమైనదా? అయినట్లైతే, ఈ యువతి ఎటువంటి భార్యయైయున్నది? సేవకుడు వెళ్లిన పనిలో సఫలత పొందాలని, మరియు వారు కనాను వరకు తిరుగు ప్రయాణంలో క్షేమంగా రావాలని అతడు ధ్యానంలో ప్రార్థించియుండవచ్చు. ఇస్సాకు ప్రార్థించి జాగ్రత్తగా ఆలోచిస్తున్నప్పుడు, **అతడు తన కన్నులనెత్తి ఒంటెలు వచ్చుట** చూచెను. ఆ విధముగా తనకు భార్యగా ఉద్దేశించిన

స్త్రీని అతడు మొదట సంగ్రహావలోకనము చేసెను.

**వచనము 64.** మరోవైపు, **రిబ్కా తన కన్నులనెత్తి** తనకు కాబోయే భర్తను మొదట సంగ్రహావలోకనం చేసింది. ఆ క్షణము యొక్క ఉత్సాహములో, ప్రాచీన సామీప్య తూర్పులోని మర్యాద ప్రకారము **ఆమె ఒంటె మీదనుండి క్రిందకు దిగినది** (యెహో. 15:18; న్యాయధి. 1:14; 1 సమూ. 25:23; 2 రాజులు 5:21).

**వచనము 65. మనలనెదుర్కొనుటకు పొలములో నడుచుచున్న ఆ మనుష్యుడెవరని? ఆమె దాసుని** అడిగెను. స్పష్టముగా, ఇస్సాకు తనకు కాబోయే భార్యతో పాటు తన తండ్రి యొక్క ఒంటెలే తిరిగి వస్తున్నాయని ముందుగానే గ్రహిస్తూ, పొలమును దాటుకుంటూ బిడారును సమీపిస్తున్నాడు. **అతను నా యజమానుడని, దాసుడు** జవాబిచ్చెను. ఇప్పటివరకూ, దాసుడు అబ్రాహామునే ఎప్పుడూ యజమానునిగా సూచించేవాడు. ఈ సమయానికి ఇస్సాకు తండ్రి చనిపోయాడని కొందరు దీనిని వ్యాఖ్యానిస్తారు. అబ్రాహాము మరియు ఇస్సాకు ఈ దాసునికి యజమానులే గనుక, ఇది ఒక అసమంజసమైన ఊహ.

సమీపిస్తున్నవాడు ఇస్సాకేనని రిబ్కా వినినప్పుడు, **ఆమె తన ముసుగును తీసుకొని తనను తాను కప్పుకొనెను.** ఆమె పవిత్రమైనదని, అవివాహిత కన్యకని ముసుగు సూచిస్తుంది; కాబోయే భర్త సమక్షములో నిశ్చితార్థము జరిగిన ఉన్నత స్థాయి స్త్రీకి ఆమె చర్య సరైనది. తరువాత యాకోబు తనకు వివాహమైన రాత్రి ఎలా మోసపోయాడో ఈ ఆచారము వివరిస్తుంది. లేయా యొక్క ముసుగు ఒకవేళ కన్నులకు తప్పించి, ముఖమంతా కప్పివేసియుండవచ్చును గనుక, అతడు వేరే స్త్రీని వివాహము చేసుకొనుచున్నాడని గ్రహించలేకపోయెను (29:23–25).

**వచనము 66.** తిరిగొచ్చిన తరువాత, **దాసుడు జరిగిన సంగతులన్నీ ఇస్సాకునకు** వివరించెను. దేవుడు అతని ప్రార్థనలకు జవాబిచ్చెను మరియు రిబ్కాను ఎన్నుకొనుట, ఆశీర్వాదముతో ఆమె వెళ్లుటకు ఆమె కుటుంబమును ఒప్పించుట, మరియు కనానుకు వారి సురక్షిత ప్రయాణము అను ఈ ప్రక్రియ అంతటిలో దేవుడు తన దైవసంకల్పిత మార్గదర్శకత్వమును ఇచ్చెను. ఈ సంగతులు అనుకోని విధముగా జరుగలేదని దాసునికి తెలుసు.

**వచనము 67.** 24వ అధ్యాయము యొక్క కథ **ఇస్సాకు** మరియు **రిబ్కా** వివాహముతో గురిని చేరుకున్నది. వారి కలియక దేవుని వాగ్దానములను మరింత సఫలీకృతం చేయుటకు సాధ్యమైనది. ఇక్కడ నుండి ముందుకు, ఇస్సాకు అబ్రాహాము యొక్క కుటుంబ అధిపతి పాత్ర కలిగియుంటాడు, మరియు రిబ్కా శారా స్థానములో మాత్రధికారణిగా ఉంటుంది.

వారు వివాహము చేసుకొనేవరకు తన గుడారములో ఆమె ఉండుట మంచిది కాదని, **ఇస్సాకు** [రిబ్కాను] **తన తల్లియైన శారా గుడారములోనికి తీసుకువచ్చెను.** శారా చనిపోయి మూడు సంవత్సరములు గడచిపోయినా,[22] ఇస్సాకు తనకు కాబోయే భార్య కోసం ఆ గుడారమును ఉంచుకొనెను.

ఎంతకాలము వివాహ సంభోగము ముందు నిశ్చితార్థము జరిగిన జంట వేచియున్నారో, వాక్యము తెలుపలేదు. అబ్రాహాము ఉత్సవాలలో పాల్గొని వాగ్దాన పుత్రుడైన, తన కుమారుడు, అతని సహోదరుడైన నాహోరు యొక్క మనుమరాలిని (24:15) తను వధువుగా తీసుకొనుట చూచి సంతోషించేవరకు ఇస్సాకు వివాహమును ఆలస్యము చేసియుండవచ్చును.

వివాహము ఎప్పుడైతే జరిగినదో, రిబ్కా **అతనికి భార్య ఆయెను, మరియు అతడు ఆమెను ప్రేమించెను.** వివాహమును గూర్చిన బైబిలు కథలు తరచూ ప్రేమను గూర్చి చెప్పలేదు, కానీ అది ఎందుకంటే తల్లిదండ్రులు సాధారణముగా వివాహాలు ఏర్పాటు చేసేవారేమో మరియు జంటలు వివాహము జరిగేంతవరకు ఒకరినొకరు ప్రేమించుకొనుట నేర్చుకొనలేదు.[23] ఏదేమైనా, ఇస్సాకు భావోద్వేగాలు ఇక్కడ తెలుపబడినవి. తన తల్లి మరణమును గూర్చి అతడు బహుగా దు:ఖించెను మరియు మూడు సంవత్సరముల తరువాత కూడా తల్లి లేని లోటును గూర్చి బాధపడుతూనే ఉన్నాడు. అతని హృదయములోని శూన్యతను రిబ్కా నింపివేసినదని మరియు **తన తల్లి విషయమై దుఃఖనివారణపొందెను** అని వ్యాఖ్యాత చెప్పెను.

## అన్వయము

### ఒక సేవకుని యొక్క విశ్వాసము (అధ్యాయము 24)

24వ అధ్యాయములో ఇస్సాకునకు భార్యను వెతుకుటను గూర్చి ముఖ్య ఉద్దేశమైయున్నను, ఈ కథనం అబ్రాహాము యొక్క ప్రధాన సేవకుని విశ్వాసమును గూర్చి బోధించుచున్నది. మనము కుడా అతడు కలిగివున్నటువంటి విశ్వాసమును కలిగియుండుటకు ప్రయత్నించవలెను.

*సాక్ష్యము మీద ఆధారపడిన విశ్వాసము* (24:1–9). ఇస్సాకునకు ఒక తగిన భార్యను తీసుకొనివచ్చుటకు దైవిక నడిపింపును వాగ్దానము చేస్తూ, అబ్రాహాము తన సేవకునికి ఆశీర్వాదముగా ఉండెను. లేఖనములు దేవుడు చేసిన అనేకమైన అద్భుత కార్యములను గూర్చి తెలియపరచును: అయన సృష్టిలోనూ, జల ప్రళయము, నిర్గమకండములో గల కార్యములను చేయుటలో దేవుని మహిమ మరియు ఆయన శక్తి బయలుపరచబడుచున్నవి. ఈ అధ్యాయము దేవుడు ఒక భిన్నమైన రీతిగా కార్యములు చేయుటను వివరిస్తున్నది: బాహ్యమైన అద్భుతములు ద్వారా కాక, దైవిక ఏర్పాటు ద్వారా. ఈ సందర్భములో దేవుడు తన వుద్దేశమును సాధారణమైన మానవ చర్యల ద్వారా, తెర వెనుక నెరవేర్చెను. దేవుడు అనేక సందర్భాలలో అబ్రాహాముతో మాట్లాడెను, తననుతాను కనపరుచుకొనెను, కానీ, ఈ అధ్యాయములో, అబ్రాహామైనను లేక అతని

సేవకుడైనను దేవుని స్వరమును వినుటను గూర్చి గాని, దైవిక దర్శనము చూచుటను గూర్చి గాని మనకు కనబడవు.

అందుకు బదులుగా, అబ్రాహాము యొక్క దైవిక పిలుపును మరియు అనేక సంవత్సరాల నుండి దేవుడు అతనిని ఆశీర్వదించిన విషయములను గూర్చి నమ్మదగిన సాక్షముపై సేవకుని విశ్వాసము మీద ఆధారపడియుంది. విశ్వాసము అనునది అదృశ్యమైన వాటియందును, "ఇంకా లేని" వాటి యందును కలిగియుండుట వలన దేవుని చిత్తము ఆ వ్యక్తి జీవితములో నేరవేర్చబడును. ఇటువంటి విశ్వాసము అబ్రాహాము సమస్తమును విడిచిపెట్టి తానెన్నడు ఎరుగని ప్రదేశమునకు వెళ్లుటకును మరియు ఊహించలేని ఆశీర్వాదములు అనుభవించుటకును కారణమాయెను (హెబ్రీ. 11:1, 8–10).

సమస్తమును దేవుని స్వాదీనములో ఉన్నవనియు, తన జీవితమును దేవుడు మలుచుచున్నాడనియు అబ్రాహాము మాటలు సేవకునికి జ్ఞాపకము చేసెను. ఆ దేవుడే అబ్రాహామును తన "జన్మ స్థలము నుండి" (24:7) తీసుకువెళ్లి అత్యధికముగా దీవించి, ఈ స్థలములోనికి తీసుకొని వచ్చెను. ఈ సంఘటనలన్నీ ఆకస్మికముగా జరుగలేదు; అవన్నీ దేవుని యొక్క ప్రణాళికలోని భాగమే. ఆ సేవకుడు హారానులో ఇస్సాకునకు భార్యను కనుగొనుట అనేది, అబ్రాహామును ఆశీర్వదించి, అతని ద్వారా ఈ భూమి మీద కుటుంబములు అన్నీ దీవించాలి అనేది చాల ముఖ్యమైనది. కాబట్టి, అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకునకు తగిన భార్యను కనుగొనుటకు దేవుడు తగిన నడిపింపు ఇచ్చునని దేవునియందలి విశ్వాసముతో నడవాలని, ప్రోత్సహించి, సేవకుని బహుదూర ప్రయాణమునకు పంపెను.

ఒక వ్యక్తి విశ్వసించుటకు ప్రతీదీ ముందే చూడాలనుకుంటే దేవుడు ఆశీర్వదించుటకు, తన చిత్తము నెరవేర్చుటకు కావలసిన విశ్వాసము అతని యందు లేదు అని అర్థము. యేసు ప్రభువు పునరుత్థానుడై తిరిగి లేచి తన శిష్యులకు కనబడినపుడు, తోమా వారి మధ్య లేడు. మిగిలిన శిష్యులు తోమాకు యేసు ప్రభువు సజీవుడాయెనని చెప్పగా, తోమా అవిశ్వాసముతో "నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆ ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని" (యోహాను 20:25) అనెను. యేసు ప్రభువు తోమాకు దయ చూపి ఒక వారం తరువాత తోమాకు కనిపించి, "నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివైయుండుమనెను" (యోహాను 20:27). అందుకు తోమా ఆయనతో "నా ప్రభువా, నా దేవా అనెను; యేసు – నీవు నన్ను చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులని అతనితో చెప్పెను" (యోహాను 20:28, 29). ఇటువంటి విశ్వాసమును ప్రారంభ క్రైస్తవులు కలిగియున్నారు (1 పేతురు 1:8), ఇదే విశ్వాసమును నేడు మనమునూ కలిగియుండాలి. మనము ఆయన యొక్క

మహిమ గల పునరుత్థాన శరీరమును చూడకపోయినను, మనము "అప్రస్తుతమైన" భవిష్యత్ పునరుత్థానమును నమ్ముచున్నాము (1 కొరింథీ. 15:50–58; 1 థెస్స. 4:13–18). మన విశ్వాసము మరణించి తిరిగి సజీవుడై లేచిన యేసును చూచిన అపొస్తలుల సాక్ష్యముపై, వారితో ప్రభువు చెప్పిన మాట "నేను జీవించుచున్నాను గనుక మీరునూ జీవింతురు" అన్న మాటపై అధారపడియున్నది (యోహాను 14:19; 1 యోహాను 3:1–3 చూడుము).

ఇదే రకమైన విశ్వాసమును హెబ్రీ పత్రిక రచయిత తన చదవరులను అనుకరించమని కోరుతూ "విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజ స్వరూపమును, అదృశ్యమైనవి ఉన్నవనుటకు రుజువునై ఉన్నది" అని వ్రాసెను (హెబ్రీ 11:1). అంతేకాక, "విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై ఉండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" అని వ్రాసెను (హెబ్రీ 11:6). జలప్రళయమును చూడకపోయినను, ఇటువంటి విశ్వాసమును నోవాహు కలిగియుండెను; దేవుడు వాగ్దానము చేసిన ఏ ఆశీర్వాదమును అబ్రాహాము చూడకపోయినను, ఇటువంటి విశ్వాసమునే కలిగియుండెను (హెబ్రీ 11:7, 8). విశ్వాసము యొక్క నాణ్యతకు దేవుని స్వయం ప్రత్యక్షత, దేవదూతల స్వరము, నాటకీయమైన అద్భుతము అక్కరలేదు. ప్రపంచ చరిత్రలో అనేకమంది విశ్వాసులు ఇటువంటివాటిని అనుభవించలేదు. వారి విశ్వాసము పాత నిబంధనలో దేవునితో నడచిన, క్రొత్త నిబంధనలో యేసుతోను, అపొస్తలులతోను నడచి దేవుని మహిమ గల కార్యములను చూచిన వారి సాక్ష్యములపై ఆధారపడును. సువార్తను మనము వినినప్పుడు, మన హృదయాలు విశ్వాసముతో నిండి మన జీవితాలు మార్పు చెందును. అందుకే "లోకమును" జయించిన "విజయము" మన విశ్వాసమే (1 యోహాను 5:4).

*ప్రార్థనా శక్తి యందలి విశ్వాసము* (24:10–14). అబ్రాహాము తన సేవకునికి, ప్రార్థనా శక్తిని గూర్చి సాక్షిగా నిలిచెను. ఐదు సార్లు, దేవుని ప్రార్థించుటకు, ఆరాధించుటకు మరియు బలి అర్పించుటకు అబ్రాహాము బలిపీఠములు కట్టెను (12:7, 8; 13:4, 18; 22:9). వీటిలో ఒక సంధర్భములో దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమాయెను అని మనము చదువుదుము (12:7); రెండు సందర్భములలో, యెహోవా నామమున ప్రార్థన చేసెను (12:8; 13:4) అని లేఖనము చెబుతుంది. ఆది. 13:18 నందు అతడు ఏందు నిమిత్తము దేవునిని ఆరాధింటకు బలిపీఠము కట్టెనో వ్రాయబడలేదు. 22:2, 9 నందు మోరియా పర్వతముపై ఇస్సాకును బలిగా అర్పించుటకు కట్టబడిన బలిపీఠముపై, చివరికి పొట్టేలు అర్పింపబడెను (22:13).

మోరియా పర్వతముపై అబ్రాహాము, ఇస్సాకు మాత్రమే ఉన్ననూ, అతని నమకమైన సేవకుడు ఈ కార్యమునకు సాక్షియై ఉండవచ్చు (22:5). ఈ సేవకుడు అబ్రాహాము చేసిన యధార్థమైన ప్రార్థన సమయాలను చూచియుండవచ్చు. కాబట్టి

ప్రార్థనను ఆలకించి, వాటికి జవాబు యిచ్చిన మరియు తన ప్రజల జీవితాలలో పని చేయు ఏకైక నిజ దేవునియందు ఆ సేవకుడు విశ్వాసము ఉంచాడు.

బలిపీఠము కట్టిన ఈ ఐదు సందర్భాలే కాక, లోతు, అతని కుటుంబము, సొదొమ ప్రజలను గూర్చి అబ్రాహాము చేసిన ప్రార్థనా సంభాషణల ప్రత్యక్షమైన వర్ణన మనకు యివ్వబడినది (18:22–33). ఈ సంభాషణ ద్వారా దేవుడు అబ్రాహాము యొక్క ప్రార్థనకు జవాబిచ్చుటలో సమ్మతి కలిగి, ఆ పట్టణములో పదిమంది నీతిమంతులు ఉన్నయెడల, ఆ పట్టణమును నాశనము చేయకుండా విడిచిపెట్టెదననెను. ఈ సందర్భము అబ్రాహాము యొక్క సేవకునికి తెలిసియుండక పోవచ్చు, ఎందుకనగా, ఈ సంభాషణ దేవునికిని, అబ్రాహామునకునూ మధ్య జరిగినది. ఒకవేళ, అబ్రాహామే తన సేవకునికి ఈ సంఘటనను తరువాత వివరించి యుండవచ్చు. సొదొమ వాసులను తమ శత్రువులైన మెసొపొతమియ రాజుల నుండి విడిపించుటకు అబ్రాహాముతో వచ్చిన 318 మందిలో ఈ సేవకుడునూ ఒకడై ఉండవచ్చును (14:14–16). అతడునూ, అతనితో ఉన్న తోటి సేవకులునూ ఈ పట్టణ ప్రజలను కాపాడుటకు ప్రాణములను తెగించినవారు, కనుక ఈ పట్టణమును గూర్చి ఒక ఆశక్తి ఇతడునూ కలిగియుండవచ్చు. తరువాత, మెల్కీసెదెకు మరియు అబ్రాహాము తమ శత్రువులపై యుద్ధములో జయమిచ్చిన దేవునికి కృతజ్ఞతలు తెలుపుట కూడా ఈ సేవకుడు యెరిగియుండవచ్చు (14:17–24).

కాలము గడిచే కొలది ఈ సేవకుడు పెద్దవాడై, ఒక నమ్మకమైన సేవకుడుగా ఎదుగుటను అబ్రాహాము గుర్తించాడు. అబ్రాహాము యొక్క అభిరుచి ఎరిగిన సేవకునిగా వీరిరువురి బంధము బలపడెను. ఇందును బట్టి, అబ్రాహాము తన కుమారునిగా స్వీకరించాలనుకొన్న దమస్కువాడైన ఎలీయెజెరు ఈ సేవకుడని కొందరు అందురు (15:2–4). దేవుడు ఎలీయెజెరును అబ్రాహాము యొక్క వారసునిగా అంగీకరించక పోయినను (17:15–19), అబ్రాహాము తన ఆస్తంతటిపైన, అతనిని నమ్మకమైనవానిగా నియమించియుండవచ్చు. అంతేకాక, అబ్రాహాము తన సేవకునికి ఒక తండ్రిలాంటి వాడు కనుక, అతడికి ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను తెలిపియుండవచ్చు. సంవత్సరాలు గడువగా, అబ్రాహామునకు కలిగిన దానంతటిని బట్టి మరియు తాను ఏమైయున్నాడో దానిని బట్టి దేవుని మహిమపరచిన విశ్వాసియు మరియు ప్రార్థనాపరుడని సేవకుడు తన యజమానుని గుర్తించాడు.

ఆ సేవకుడు తన యజమానుని విశ్వాస యాత్రలో జరిగిన అద్భుత కార్యము అనగా సంతానము కలుగుటకు అవకాశములేని సమయములో ఇస్సాకు జన్మించుటను ఎరిగినవాడు. ఈ కార్యమునకు ముందు ఒకవేళ దేవుని గూర్చి ఏదైనా సందేహమున్నను, దీని తరువాత అది ఇక లేదు. దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదు అని అతనికి తెలుసు. కాబట్టి, దేవుని దూత ఇస్సాకునకు తగిన భార్యను కనుగొనుటకు నిన్ను నడిపించును అని అబ్రాహాము వాగ్దానము చేసి అతనిని మెసొపొతమియకు పని మీద పంపినప్పుడు (24:7), అతడు సందేహించలేదు.

అతడు వెంటనే తన సుదూర ప్రయాణమును ప్రారంభించెను.

ఈ సేవకుని యొక్క విశ్వాసమునకు ప్రతీకగా, అతడు హారాను నందున్న "నాహోరు పట్టణము" చేరి, ఇస్సాకునకు సరియైన భార్యను కనుగొనుటలో తనకు జయమునిమ్మని దేవునికి ప్రార్థన చేసెను (24:12–14). ఈ విషయములో, అతడు రెండు సూచనలు అడిగెను, అవేవనగా: ఆ స్త్రీ వచ్చి తనకునూ, తన ఒంటెలకునూ దాహమునకు నీళ్లు చేది పోయవలెను అనునవి. ఆ సేవకుడు దేవుని కోరుకొనిన రెండు సంగతులను రిబ్కా చేసినట్లు ఈ వాక్యభాగం వివరిస్తుంది (24:15–20). అప్పుడు అతడు ఒక బంగారపు ఉంగరమును, బంగారపు కమ్మిని ఆమెకు ఇచ్చి (24:21, 22), ఆమెను రెండు ప్రశ్నలు అడిగెను: "నీవు ఎవరి కుమార్తెవు?" మరియు "నీ తండ్రి ఇంట మేము ఈ రాత్రి బస చేయుటకు స్థలమున్నదా" అని అడిగెను(24:23). అందుకు రిబ్కా జవాబుగా, తాను నాహోరు(అబ్రాహాము యొక్క సహోదరుడు) యొక్క కుమారుడగు బెతూయేలు కుమార్తెననెను. అంతేకాక, తన ఇంట వారికి ఉండుటకు విస్తారమైన స్థలము ఉన్నదనియు, తమ ఒంటెలకు మేతయుకూడా కలదని చెప్పెను (24:24, 25). దీనిని బట్టి, ఆ సేవకుడు దేవుడు తన ప్రార్థనకు జవాబిచ్చెనని గుర్తించి, సాష్టాంగపడి, తన యజమానుని బంధువుని ఇంటికి తనను నడిపించిన దేవుని స్తుతించెను (24:26, 27).

అబ్రాహాము ప్రార్థన ఏలాగున తన సేవకునికి మాదిరిగా ఉండెనో, యేసు ప్రభువు కుడా తన శిష్యులకు మాదిరిగా ఉండెను. వారు కుడా అనేక సార్లు ప్రభువు ప్రార్థించుట చూచి, బాప్తీస్మమిచ్చు యోహాను తన శిష్యులకు ప్రార్థన నేర్పినట్టుగా, తమకు కుడా నేర్పించమనేను (లూకా 11:1). అప్పుడు, వారికి ప్రభువు, ఒక మాదిరియైన ప్రార్థన నేర్పి, ప్రార్థన యొక్క సామర్థ్యమును తెలియజేసెను (లూకా 11:2–13; మత్తయి 6:5–15). అపొస్తలులు మరియు ఆదిమ క్రైస్థవులునూ, యేసు ప్రభువు తిరిగి లేచి, ఆరోహనమైన తరువాత ఇదే మాదిరిని వెంబడించిరి (అపొ. 1:9–14). పెంతెకొస్తునందు మరియు తరువాత వారి ప్రార్థనలను మనము చదవగలము (అపొ. 2:40–47). పేతురు చెరశాలలో వేయబడి మరణ అపాయముతో బెదిరించినప్పుడు ప్రార్థించినట్టు (అపొ. 12:5–17), అంతియొకయ సంఘము పౌలు మరియు బర్నబాలను పంపినప్పుడు ప్రార్థించినట్టు (అపొ. 13:1–3) చదవగలము.

అపొస్తలుడైన పౌలు తన సువార్త జీవితములో ప్రార్థనా శక్తిని అనుభవించెను. దేవుడు అతనిని అనేక అపాయముల నిండి, హింసల నుండి, చివరికి మరణము నుండి కూడా తప్పించెను[24]. అబ్రాహాము ఎలాగైతే తన సేవకుని ప్రార్థన శక్తితో బలపరచి పంపెనో, అదే రీతిగా పౌలు మొదటి శతాబ్ద క్రైస్తవులను (అన్ని తరములలో ఉన్నవారినీ) తన మాదికరమైన ప్రార్థన ద్వారా దీవించెను. థెస్సలోనికలో ఉన్న ప్రజలను "యెడతెగక ప్రార్థనచేయుడి" అని హెచ్చరించెను (1 థెస్స. 5:17), ఎఫెస్సులో ఉన్న వారిని, "ఆత్మ వలన ప్రతి సమయమందును ...

సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి" అనెను. "సువార్త మర్మమును" ధైర్యముగా తెలియజేయుటకు తన నిమిత్తము ప్రార్థించవలెనని ఆయన కోరెను (ఎఫెసీ. 6:18, 19).

*పంచిపెట్టబడిన విశ్వాసము* (24:28–51). అబ్రాహాము నుండి ఆశీర్వాదములు రెబ్కా కుటుంబమునకు పంచిపెట్టబడెను. జరిగిన సంఘటనలన్నియు, వచ్చిన అతిథిని గూర్చి, అతని మాటలను, అతడు ఆమెకు ఇచ్చిన బహుమానములను, అతడు చేసిన ప్రార్థనను తన ఇంటివారికి తెలియజేయుటకు రిబ్కా తన ఇంటికి పరిగెత్తెను. లాబాను తన సహోదరి యొక్క మాటలు విని ఆశ్చర్యపడెను, అతడు ఆ బంగారు ఉంగరము, బంగారు కమ్మిని చూసి, వచ్చిన ఆ అతిథులను ఎదుర్కొనబోయెను (24:28–30). లాబాను సంపాదనను పొందుటకు మోసము కూడా చేయ వెనకాడడని మనకు తరువాత యాకోబు ద్వారా తెలియును (29:13–31:16). ఈ సంధర్బములో, అతడు ఎంతో అభిమానము చూపుతూ, "యెహోవా వలన ఆశీర్వదింపబడినవాడా" అని ఆహ్వానించెను (24:31). దీనిని బట్టి అబ్రాహాము ఏ విశ్వాసమునైతే తన సేవకునికి అందించెనో, ఆ సేవకుడు అదే విశ్వాసమును గూర్చి వారికి తెలియజేసెను. లాబాను యొక్క ఆశీర్వాదము ప్రాముఖ్యమో కాదో మనకు తెలియదు. ఏది ఏమైనా, అతడు అబ్రాహాము యొక్క సేవకునికిని, అతనితో ఉన్న వారికిని, కాళ్లు కడుగుకొనుటకు నీళ్లు యిచ్చెను, వారికి ఆహారమును, వారి ఒంటెలకు మేతయును ఇచ్చెను (24:32, 33a).

అబ్రాహాము యొక్క సేవకుడు తన ప్రయాణ విషయములో చాలా ఆలోచన కలవాడు, కనుక తన రాకకు గల కారణమును తెలియజేయక ముందు ఎట్టి ఆహారమును తీసుకొనలేదు. లాబాను అతనిని మాట్లాడమనినపుడు, "నేను అబ్రాహాము దాసుడను, యెహోవా నా యజమానుని బహుగా ఆశీర్వదించెను గనుక అతడు గొప్ప వాడాయెను; అతనికి గొర్రెలను గొడ్లను వెండి బంగారములను దాస దాసీజనమును ఒంటెలను గాడిదలను దయచేసెను" అని అతడు చెప్పెను (24:34, 35). అంతేకాక తన వృద్ధాప్యమందు ఇస్సాకును కనిన అబ్రాహాము భార్యయైన శారాను గూర్చియు, ఇస్సాకు మాత్రమే వారికి కలిగినదానికి ఏకైక వారసుడనియు తెలిపెను (24:36).

ఈ విషయములతో పాటు ఆ సేవకుడు, దేవుని దూత ఈ ప్రయాణములో తనను ఏ రీతిగా నడిపించెనో, దేవుడు తన ప్రార్థనకు ఏలాగు బదులిచ్చెనో తెలియజేసెను (24:1–27). అతడు రిబ్కాను బట్టి, తన యజమానుని మాట చొప్పున జరిగించిన దేవునికి కృతజ్ఞతలు తెలియజేసెను. ఎటువంటి ఆలస్యము లేకుండా రిబ్కాను కనానకు ఇస్సాకునకు భార్యగా ఉండుటకు లాబానును, బెతుయేలును త్వరగా నిర్ణయించుకొనమని చెప్పెను. దీనికి వారు సాధారణమైన

జవాబుగా “యెహోవా సెలవిచ్చెను” అనిరి (24:51).

ఈ కుటుంబము కేవలము ఒక సేవకుడు చెప్పిన మాటను మాత్రమే కథకు ఆధారముగా కలిగియుండిరి. దేవుని దూత ఈ మనుష్యుని నాలుగు వందల మైళ్లు నడిపించి సరియైన చోటికి రిబ్కాను కలుసుకొనుటకు నడిపించెను అనుటకు ఎటువంటి ప్రయోగాత్మక ఆధారాలు లేవు. అయినను, లాబాను, బెతుయేలు రిబ్కాను కనాను దేశమునకు ఇస్సాకునకు భార్యగా వివాహము చేయబడుటకు పంపుతూ, “ఇది యెహోవా వలన కలిగిన కార్యము” అనిరి (24:50).

ఈ సేవకుడు ఇచ్చిన సమాచారము నిజమైనదిగా ఎంచబడెను, అతడు రిబ్కా కుటుంబమునకు అబద్ధము చెప్పుట ద్వారా అతనికి ప్రయోజనమేమి లేదు. దేవుని యొద్ద నుండి వచ్చే ఏ సందేశమైనా ప్రజల హృదయాలు తాకి, వారి జీవితాలను మార్చును (1 కొరింథీ. 1:21–25). ఇదేరీతిగా. మొదటి శతాబ్దములో, యేసు క్రీస్తు యొక్క జీవితము, మరణం, పునరుత్థానములను గూర్చిన సాక్ష్యము బహు బలమైనది. ఎవరైనా ఇవి చారిత్రక సంఘటనలు కాదని నేడు అనినయెడల ఎందుకు ఘోరమైన హింసల మధ్య అపొస్తలులును, ఇంకా అనేకులు ఇదే సత్యమును ప్రకటించిరి అను దానికి జవాబు చెప్పవలెను. సంపద కొరకు, పేరు, అధికారము కొరకు ప్రజలు కొన్ని సార్లు అబద్ధము చెపుతారనేది నిజమైనప్పటికి, ఏ ఒక్కరు సమస్తమును, ప్రాణము సైతం పోగొట్టుకొనుటకు తాను అబద్ధమని నమ్మినదానిని ప్రకటించారు.

పౌలు యొక్క సాక్ష్యము చాల బలమైనది ఎందుకగా అతడు మరణమునకు కూడా భయపడువాడు కాదు. అతడు సజీవుడైన యేసును దమస్కు మార్గమున చూచెను (అపొ. 9:1–22). తన బాప్తిస్మము తరువాత పౌలు క్రైస్తవులను హింసించువానిగా గాక, గొప్ప సువార్తికునిగా మారిపోయెను. ఆ సమయము నుండి అతడు, “నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము” (ఫిలిప్పీ. 1:21) అని పలికెను. అందుచేత, తన మరణానికి ముందు తిమోతితో “నా సువార్త ప్రకారము, దావీదు సంతానములో పుట్టి మృతులలో నుండి లేచిన యేసుక్రీస్తును జ్ఞాపకము చేసుకొనుము” (2 తిమోతి 2:8) అని చెప్పెను. ఒక పద్యములోని మాటలను పౌలు ఇక్కడ వ్రాసెను:

> మనమాయనతో కూడా చనిపోయినవారమైతే, ఆయనతో కూడా బ్రతుకుదుము;
> సహించినవారమైతే ఆయనతో కూడా ఏలుదుము;
> ఆయనను ఎరుగమంటే, మనలను ఆయన ఎరుగననును;
> మనము నమ్మదగని వారమైనను, ఆయన నమ్మదగినవాడుగా ఉండును;
> ఆయన తన్ను తానెరుగననలేడు (2 తిమోతి. 2:11–13).

క్రైస్తవులందరూ ఆత్మీయ శక్తి మరియు నిరీక్షణతో, “నేను జీవించుచున్నాను గనుక మీరును జీవింతురు” (యోహాను 14:19b) ప్రభువు చెప్పిన వాగ్దానము జ్ఞాపకము

చేసుకొనుచూ మరణమును ఎదుర్కొనగలరు.

## ఒక ప్రత్యేకమైన పని కొరకు పంపబడెను (24:1–9)

24వ అధ్యాయము "దేవుడు అన్ని విషయములలో అబ్రాహామును ఆశీర్వదించెను" (24:1) అను ప్రకటనతో ప్రారంభమాయెను. రచయిత దేవుని వాగ్దానములో భాగాలైన: అతనిని ఆశీర్వదించి, అతని పేరు గొప్ప చేసి (తన తోటివారందరికంటే ఆస్థిలోను, బలములోను హెచ్చించి), అతనిని ఆశీర్వాదించినవారిని ఆశీర్వాదించి, అతనిని శపించువారిని శపించుట అనునవి తెలియజేసెను (12:2, 3). అయినను అబ్రాహాము వాటిని అనగా: వాగ్దాన భూమియైన కనాను దేశము, దానిని స్వాధీనపరచుకొనే గొప్ప దేశము, భూమిపై ఉన్న కుటుంబములన్నిటికి ఆశీర్వాదం విస్తరించుట అనునవి ఇంకా పొందుకొనలేదు.

ఈ ఉదాహరింపబడిన దీవెనలన్నియు ఇస్సాకు పుట్టుక ద్వారా మాత్రమే జరుగును. ఇవి నిజ స్వరూపము దాల్చుటకు, ఇస్సాకు ఒక భార్యను కలిగి, తనకంటూ ఒక కుటుంబాన్ని కలిగియుండాలి. ఇందును బట్టి అబ్రాహాము తన పితరుల నుండి అనగా హారాను నుండి తన కుమారుడైన ఇస్సాకునకు తగిన భార్యను తెచ్చునట్లుగా తన నమ్మకమైన సేవకుని పంపెను. ఈ ప్రయాణమునకు ముందు అనగా మెసొపొతమియ వెళ్లాక ముందు అబ్రాహాము తన సేవకునితో, ఈ ప్రయాణమును గూర్చి ఒక నిబంధన చేయించుకొనెను (24:2–9).

అబ్రాహాము తన కథను ఈ సేవకునికి, తన సేవకులందరికి అనేక సార్లు చెప్పినప్పటికీ, ఇది మరొక సారి చేయుట ప్రాముఖ్యమని గుర్తించెను. అతడు అనేకులు దీవించబడటకు ఒక మధ్యవర్తిగా ఉండవలెనని జ్ఞాపకము చేసుకొనెను (12:2), కనుక తన సేవకుని హారానునకు పంపే ముందు ఈ విషయాలన్నిటిని తెలియజేసెను. ఆ దేశమునకు దేవుడు ఇచ్చిన దీవెనలు అనుభవించుటకుగాను, "నీ సంతానమునకు ఈ దేశమును ఇచ్చెదను" (24:7) అన్న దేవుని మాటను బట్టి, అబ్రాహాము తన సేవకునుకి ఇస్సాకు ఈ దేశములోనే ఉండాలని ఖచ్చితముగా చెప్పెను. తన బంధువుల యొద్ద నుండి ఒక యవ్వన స్త్రీ తాను పంపిన దాసునితో వచ్చుటకు తిరస్కరించునేమో అనుకొనెను. అట్టి పరిస్థితిలో, అబ్రాహాము తన ప్రమాణమును విడిచిపెట్టవలెను, అప్పుడు ఇస్సాకు ఒక కనాను స్త్రీని వివాహమాడవలెను (24:3–8).

అబ్రాహాము తన సేవకుని హారానునకు పంపించుట అనేది, రాబోయే దినాలలో యేసు ప్రభువు, తన శిష్యులు అనుకరించే మాదిరిని చూపెను. ఈ సేవకుని ప్రయాణము కేవలము భౌతికమైనదిగా కనబడును కాని ఆత్మీయ భావమును కలిగియుండెను. అతడు ఇస్సాకునకు సాటియైన భార్యను కనుగొనవలెను, రాబోయే దినాలలో వీరిద్దరు లోక రక్షకుడైన యేసుక్రీస్తు పుట్టబోవు దేశమునకు

పూర్వీకులుగా ఉందురు.

యేసుక్రీస్తు కూడా నమ్మకమైన మనుష్యులను (అపొస్తలులు) కనుగొని, తన ఆరోహణం తరువాత రాజ్య సువార్తను భూమ్యందంతటా ప్రకటించుటకు ఎన్నుకొనవలెను (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16; లూకా 24:46–49). ఈ మనుష్యులు భూమి మీద ఉన్న కుటుంబములన్నిటిలో నుండి, ఆత్మీయ సంతానమును బయటకు తెచ్చుదురు (అపొ. 2:5–11, 36–41; గలతీ 3:26–29). ఈ ఆజ్ఞను పౌలు కొనసాగించినను పన్నెండు మంది అపొస్తలులు నెరవేర్చుటకు, అది చాల గొప్పది. సువార్త ఇతరులకు అప్పగిమ్పబడాలి, తద్వారా చివరి గడియ వరకు అది ప్రకటింపబడుతూ ఉంటుంది. ఇందును బట్టి పౌలు – బందింపబడి మరియు మరణమౌటకు సిద్ధపడుతుండగా, ఆ బాధ్యతను తిమోతికి తెలిపెను: "నీవు అనేక సాక్షుల ఎదుట నా వలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యము గల మనుష్యులకు అప్పగింపుము" (2 తిమోతి 2:2). అన్ని కాలములలో ఉన్న క్రైస్తవులూ నమ్మకమైన సేవకులుగా ఉండి, వారు పొందిన సువార్తను (మంచి వార్త), ఇతరులకు అప్పగించువారుగా ఉండాలి (1 కొరింథీ. 15:1–4).

## దేవదూతల పరిచర్య (24:7)

అబ్రాహాము తన సేవకునికి దేవదూతల పరిచర్యను గూర్చి తెలియజేసెను. అనేక పర్యాయములు దేవదూతల పరిచర్యను అబ్రాహాము తన జీవితములో ఎరిగియుండెను, వాటిలో కొన్ని అతడు వినెను, మరి కొన్ని అనుభవించెను. కాబట్టి, వాటిని తన కుటుంబానికి, సేవకులకు వివరించి ఉండవచ్చు. వాటిలో కొన్ని:

1. హాగారు, శారా యొక్క కోపమునుండి తప్పించుకొనుటకు అరణ్యములోకి పోగా, ఒక దూత ఆమెకు ఎటువంటి హాని కలుగకుండా కాపాడి, అబ్రాహాము నొద్దకు సురక్షితముగా పంపెను (16:7–14).

2. అబ్రాహాము మమ్రే వద్ద దేవదూతలను ఎదుర్కొనెను. వారు భోజనం చేస్తూ ఉండగా అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తులలో ఒకరు మరలా వచ్చే సంవత్సరం, ఈ సమయానికి శారా ఒక కుమారుని కనును అనిరి. వారు మనుష్యుల రూపములో ఉన్న దేవదూతలై ఉండవచ్చు, వారిలో ఒకరు ప్రభువుగా మాటలాడెను (దేవుని దూతయై ఉండవచ్చు; 18:1–33). హెబ్రీ పత్రిక వ్రాసిన రచయిత ఈ సందర్భామునే వ్రాసి ఉండవచ్చు: "ఆతిథ్యము చేయ మరవకుడి; దానివలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యముచేసిరి" (హెబ్రీ. 13:2).

3. ఇస్సాకును బలిగా అర్పించమని దేవుడు అడిగినందున, "దేవుడు అబ్రాహామును పరిశోధించెను" (22:1, 2) అని ఆదికాండము యొక్క రచయిత వివరించెను. కాని, అబ్రాహాము తన కుమారుని చంపే ఆ సమయములో, యెహోవా దూత అతనిని ఆపి, "నీకు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుతీయలేదు

గనుక నీవు దేవునికి భయపడువాడవని ఇందువలన నాకు కనబడుచున్నాదనెను" (22:11, 12). ఈ సంధర్బములో దేవుడు ఒక దూత వలె కనిపించి మాట్లాడెను.

అబ్రాహాము మరియు అతని కుటుంబము దూతలతో వ్యక్తిగత అనుభవాలు కలిగియున్నందున, "యెహోవా తన దూతను నీకు ముందుగా పంపును; కనుక హారాను నుండి నా కుమారునికి భార్యను తీసుకొని వచ్చెదవు" (24:7) అని తేలికగా చెప్పగలిగెను. అబ్రాహాము తన సేవకునికి ఆశీర్వదముగా ఉండెను ఎట్లనగా, దేవుని దూత తన కంటే ముందుగా వెళ్లి ఇస్సాకునకు భార్యను కనుగొనుటకు మార్గము సిద్ధపరచునని అతడు నమ్మెను.

## రిబ్కా యొక్క విశ్వాసము (24:15–67)

అబ్రాహాము అప్పగించిన పనికి సేవకుడు చూపిన విశ్వసనీయతను బట్టి, ఇస్సాకు రిబ్కాలకు ఆశీర్వాదము వచ్చెను. రిబ్కా వయస్సులో చిన్నదైనను అత్యాశాపరురాలు కాదు. తన సహోదరుడైన లాబాను వలె ధనాపేక్ష తన మనస్సున లేదు. పది ఒంటెలు నిండా బహు విలువైన బహుమానములు ఆమెను మురిపించినను, బంగారు ఉంగరము మరియు బంగారు కమ్మెలు ఆమెకు ఇచ్చినను, ఆమె ఆత్మీయ మనస్సు గలది గాను, ధనము చూపుట ద్వారా పొందలేని సొత్తుగాను ఆమె ఉండెను.

ఆమె అబ్రాహాము యొక్క సేవకుడు తన యజమానుని, దేవుడు ఎట్లు మెసొపొతమియ ప్రాంతమును విడిచి కనానుకు వెళ్లుటకు పిలిచి భూమిపై అనేక కుటుంబములకు ఎట్లు ఆశీర్వాదముగా చేసెనో విని యుండవచ్చు. ఒక గొప్ప వ్యక్తి యొక్క భార్యగాను, అతని పిల్లలకు తల్లిగాను ఉండుటకు మాత్రమే కాక ఇంకా గొప్ప కారణమునకు తన జీవితమును ఇవ్వ గోరెను. తాను ఎన్నడూ ఊహించలేని ఒక ఉన్నతమైన పాత్రకు ఆమె పిలువబడెనని అనుకొనెను.

విశ్వాస వీరుల జాబితా హెబ్రీ 11లో రిబ్కా యొక్క పేరు లేకపోయినను, ఆమె పలు కారణములను బట్టి ఆ కోవకు చెందును. (1) అబ్రాహాము ఎలాగైతే కనానుకు బయలుదేరెనో, అలాగే రిబ్కా కూడా విశ్వాసముతో కనానుకు బయలుదేరెను (అపొ. 7:2, 3). (2) తన కుటుంబాన్ని తనతో పాటు ప్రయాణములో తీసుకొనిపోవుటకు ప్రయత్నించలేదు. ఎంతో కష్టమైనను, వారిని విడిచి, ముందుకు సాగెను. (3) అబ్రాహాము వలె తన తలిదండ్రులు మరణించు వరకు హారానులో ఉండిపోలేదు. ఆమె వెనువెంటనే దైవ నిర్ణయముగా ఒక క్రొత్త ప్రదేశమునకు వెళ్లుటకును, తానెన్నడూ ఎరుగని వ్యక్తికి భార్యగా ఉండుటకును ఆ సేవకుని వెంబడించెను.

రిబ్కా గొప్ప విశ్వాసముతోను, ధైర్యముతోను తన నిర్ణయములు తీసుకొనెను. ఆమె తనకున్నది అంతా విడుచుటే కాక, తన వారికి వీడ్కోలు తెల్పుటకు ఒక వారం రోజులు కూడా తీసుకొనలేదు. యేసుక్రీస్తు యొక్క ప్రారంభ శిష్యులైన పేతురు, ఆంద్రెయ, యాకోబు మరియు యోహానులు కూడా, "నన్ను వెంబడించండి;

మనుష్యులను పట్టు జాలరులుగా మిమ్ము్మను చేయుదును” (మత్తయి 4:19) అని ప్రభువు చెప్పగా వారు ఈ రీతిగానే బదులిచ్చిరి. వారు తమ వృత్తిని, కుటుంబాలను గూర్చి ఒక సాకును చెప్పక; తమ దోనెలను విడిచి “వెంటనే” ఆయనను వెంబడించిరి (మత్తయి 4:20).

తార్సువాడైన సౌలు కూడా తాను యేసును దమస్కు మార్గములో కలుసుకొనినపుడు ఇటువంటి నిర్ణయమునే తీసుకొనెను. దేవుడు అతనిని యూదులకు మరియు అన్యజనులకు ఒక సాక్షిగా ఉండాలని పిలిచెను (అపొ. 26:15–18). అతడు ఆలస్యము చేయక, “వెంటనే” ఆ పరలోక పిలుపునకు విధేయుడైనని తెలియజేసెను (గలతీ. 1:16, 17). ప్రతీ కాలములోని ప్రజలూ దేవుని ఆహ్వానమును వినినపుడు ఇటువంటి సవాలే ఎదుర్కొందురు (మత్తయి 11:28–30; ప్రకటన 22:17). పౌలు ఇదే “అనుకూల సమయము,” ఇదే “రక్షణ దినము” (2 కొరింథీ. 6:2) అనెను. సువార్త పిలుపును నిర్లక్ష్యము చేయుట ఎంతో అపాయకరము ఎందుకనగా అటువంటి అనుకూల సమయము మరల రాదు (అపొ. 24:24–27).

రిబ్కా దేవుని పిలుపునకు విశ్వాసము ద్వారా అడుగుపెట్టినందుకు మానవాళి అంతా ఆమెకు రుణపడి ఉండాలి. ఆ రీతిగా చేయుట ద్వారా ఆమె ఒక క్రొత్త శారా ఆయెను; ఆమెకు కాబోయే భర్త ఒక క్రొత్త అబ్రాహాము ఆయెను. తద్వారా వారు ఇశ్రాయేలీయులకు పితరులుగాను, వారి ద్వారా సువార్తకు విధేయత చూపిన వారిని రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దానమును బట్టి “కాలము సంపూర్ణమైనపుడు” ఈ కార్యములు సంభవించెను (గలతీ. 3:8, 9, 26–29; 4:3–5).

---

సూచనలు

[1]“పనివాడు” (עֶבֶד, *'ebed*) అని అనువదించిన అదే హెబ్రీ పదము “దాసుడు” అని కూడా అర్థమిస్తుంది; ఏదేమైనా, దానిని అబావార్థకమైన అర్థములతో అవశ్యముగా తీసుకొనకూడదు. పురాతన కుటుంబములలో దాసులు తరచూ ప్రేమింపబడేవారు మరియు నమ్మకమైన సభ్యులుగా ఉండేవారు. [2]John E. Hartley, “יָרֵךְ,” in *Theological Wordbook of the Old Testament*, ed. R. Laird Harris, Gleason L. Archer, Jr., and Bruce K. Waltke (Chicago: Moody Press, 1980) (hereafter cited as *TWOT*), 1:408. [3]11:28లో కనబడే “తాను పుట్టిన దేశము” అను వాక్యము కల్దీయుల ఊరు”లో చనిపోయిన అబ్రాహాము సహోదరుడైన హారానును సూచిస్తుంది. [4]హెబ్రీ వాక్యములో అక్షరాలా “ఆరాము నహరైము” (NIV; NRSV; NJPSV), లేదా “రెండు నదుల ఆరాము.” ఉత్తరదక్షిణ మెసపొతొమియాలో ఈ ప్రాంతము బలిహ్ నది లోయను చుట్టుకుని యూఫ్రటీసు నది నుండి హాబుర్ నది వరకు వ్యాప్తిచెందినది. [5]K. A. Kitchen, *Ancient Orient and Old Testament* (Chicago: Inter-Varsity Press, 1966), 79–80. [6]Juris Zarins, “Camel,” in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday,

1992), 1:825–26. [7]తరువాత, యాకోబు రాహేలును బావి యొద్ద కలిసెను (29:1–12), మరియు మోషే సిప్పోరాను బావి యొద్ద కలిసెను (నిర్గమ. 2:15–21). [8]చర్యను తీసుకొనక ముందు, గిద్యోను (న్యాయ. 6:36–40) మరియు యోనాతాను (1 సమూ. 14:8–10) దేవుని యొద్ద నుండి గుర్తు కొరకు ఒకే మనవి చేసిరి. [9]E. Jenni, "אָדוֹן," in *Theological Lexicon of the Old Testament*, trans. Mark E. Biddle, ed. Ernst Jenni and Claus Westermann (Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 1:26. [10]"ప్రభువు" అనుదానికి గ్రీకు పదము యొక్క సమానమైన వాడుక కోసం యోహాను 4:11 చూడవలెను, అక్కడ సమరయ స్త్రీ యేసును "అయ్యా"గా (κύριε, *kurie*) సంభోదించినది. ఏదేమైనా, అతడు ఆనవాలుగా ఉండే యూదుడు కాడని తెలుసుకొనిన తరువాతే ఆమె ఆ విధముగా చేసినది.

[11]"కుటుంబ దేవతలను" సొంతము చేసుకున్న లాబాను అనేక దేవుళ్లను కొలిచేవాడు (31:19, 30). అయన దేవునిని కూడా ఆరాధించియుండవచ్చు, కానీ ఇది తర్కాలను ఎదుర్కొంటుంది (24:50, 51; 31:24, 49, 53ను చూడండి). [12]24:61లో పేర్కొనిన ప్రకారము కనానుకు ఉన్న యాత్రలో రిబ్కాతో పనికత్తెలు వెంబడించినట్టుగానే, ఒకవేళ లాబానుకు కూడా పురుష దాసులు యుండియుండవచ్చు. [13]అబ్రాహాము కెతూరాను వివాహము చేసుకొనినప్పుడు మరియు వారికి పిల్లలు జన్మించినప్పటి ఆధారముగా, సేవకుడు రిబ్కా కుటుంబముతో మాట్లాడుతున్న సమయములో ఈ బహుమతులు ఇవ్వనవసరము లేకపోయియుండవచ్చు. [14]Kenneth A. Mathews, *Genesis 11:27—50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 341. [15]Walter C. Kaiser, "מֹהַר,"in *TWOT*, 1:492. מֹהַר అను పదము మూడు పాత నిబంధన వాక్యభాగాలలో ఉపయోగించబడినది (34:12; నిర్గమ. 22:16; 1 సమూ. 18:25), మరియు ESV దీనిని "ఓలును కట్నముగా" ఏకరీతిలో అనువదించినది. [16]మోషే చట్టప్రకారము, కన్యకను చెరిపిన సమయాలలో, కన్యాశుల్కం యాభై వెండి రూకలుగా ఖరారు చేయబడినది (ద్వితి. 22:29). [17]Gordon J. Wenham, *Genesis 16—50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 150. [18]John E. Hartley, *Genesis*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 2000), 227. [19]Kaiser, "יָנַק," in *TWOT*, 1:383–84. క్రియ నుండి יָנַק (*yanaq*), అసమాపక క్రియ מֵינֶקֶת (*meyneqeth*) నుండి వచ్చినది దాదీని సూచిస్తుంది(24:59; నిర్గమ. 2:7). [20]ఈ "పనికత్తెలు" (దాసీలు) రిబ్కా యొక్క సామజిక స్థాయికి ఒక గుర్తు. అదేవిధంగా, యకోబును వివాహము చేసుకొనిన తరువాత రాహేలు మరియు లేయ పనికత్తెలను పొందుకున్నారు (29:24, 29).

[21]*Genesis Rabbah* 60.14. [22]ఇస్సాకునకు జన్మనిచ్చినప్పుడు శారా వయస్సు తొంభై (17:17) మరియు మరణించినప్పుడు 127 (23:1), అదేమిటంటే తన తల్లి మరణించేటప్పటికి ఇస్సాకునకు ముప్పై-ఏడు మరియు రిబ్కాను వివాహము చేసుకొనేటప్పటికి నలభై (25:20). అందుచేత, ఇస్సాకు తన తల్లియొక్క గుడారములోనికి తన వధువును తీసుకువచ్చినప్పుడు శారా చనిపోయి మూడు సంవత్సరములు అయినది. [23]యాకోబు మరియు రాహేలు నియమమునకు ప్రసిద్ధమైన వ్యతిరేకులు (29:18, 20, 30, 32). [24]అపొ. 14:19, 20; 16:25, 26; 27:23, 24, 34–36; 2 కొరింథీ. 1:8–11; 2 తిమోతి. 3:10, 11; 4:16–18 చూడండి.